UNIVERSAL
LIBRARY
OU_206130
UNIVERSAL
LIBRARY

OUP—23—4-4-69—5,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T372/J42A Accession No. G.T. 105

Author జయంతి రామయ్య పంతులు.

Title ఆంధ్ర వాచకము. 1932

This book should be returned on or before the date last marked below.

# ఆంధ్రవాచకము

## నాల్గవ తరగతి.

గ్రంథకర్తలు:

అం. జయరామారావు పంతులు, బి. ఎ., ఎల్. టి.,

దర్భా జగన్నాథ శాస్త్రులు,

కొవ్వర్తి నారాయణమూర్తి పంతులు, బి. ఎ., ఎల్. టి.,

పబ్లిషర్సు:

వేంకటరామ్ అండ్ కో.,

హెడ్డాఫీసు:—ఏలూరు.

1932.

Copy Right]

[Price 0—5—0.

ఏలూరు
వేంకటరామ్ కంపెనీవారి
రామా పవర్ ప్రెస్సునందు
ఈదర వేంకట్రావుచే
ముద్రింపఁబడియె.

# OPINION.

We welcome yet another series of Telugu Readers called "**The Andhra Readers**" published by Mr. Venkata Rao of Ellore, (proprietor of **Venkata Ram & Co.**, Ellore). The authors have long been known as educationists of experience and practical wisdom. Mr. Jayarama Rao for instance, being a leading headmaster of the Andhra Desa and Mr. Kopparti Narayana whose articles have long been enriched the Prarambha Vidya, one of the leading Elementary Teachers' Journals in Telugu.

So the authors need no introduction. The Selections as may be expected from such thoughtful practical educationists are well chosen, graded and illustrated. The style is suited to the standard, and the matter ranges from the commonplace topic to the Epic stories and lives of great and famous Indians as well as subjects for Naturestudy.

I commend the series to the consideration of the Elementary Schools in the Andhra Desa.

Camp-Ellore.
19-11-28.

(Sd). R. Tata,
*District Educational Officer,*
*(West Godavary Dt.)*


# విషయసూచిక.


| | | |
|---|---|---|
| 1. | సింహము ... ... ... | 1 |
| 2. | ఆండ్రోక్లీసు, సింహము ... ... ... | 3 |
| 3. | మార్కండేయుడు ... ... ... | 6 |
| 4. | కుచేలుని దారిద్ర్యము ... ... ... | 10 |
| 5 | కుచేలుని ఐశ్వర్యము ... ... ... | 16 |
| 6 | నక్క ... ... ... | 20 |
| 7. | ప్రహ్లాదుని విద్యాభ్యాసము ... ... ... | 22 |
| 8. | ప్రహ్లాదుని భక్తి ... ... ... | 26 |
| 9. | నరసింహావతారము ... ... ... | 31 |
| 10. | పులి - బ్రాహ్మణుడు - నక్క ... ... | 37 |
| 11. | పాపాల నిర్ణేతాంతములు ... ... ... | 45 |
| 12. | నలమహారాజు జూదము ... ... ... | 53 |
| 13. | నలదమయంతుల వియోగము ... ... | 57 |
| 14. | నలదమయంతులకై యన్వేషణము ... ... | 63 |
| 15. | దమయంతీ ద్వితీయ స్వయంవరము ... ... | 67 |
| 16. | బకాసుర వధ ... ... ... | 72 |
| 17. | గోపాలకృష్ణ గోలీలే ... ... ... | 77 |
| 18. | తెనాలి రామకృష్ణకవి ... ... ... | 83 |
| 19. | నీతిపద్యావళి ... ... ... | 87 |
| 20. | పొడుపు పద్యములు ... ... ... | 93 |
| 21. | ప్రార్థన పద్యములు ... ... ... | 95 |
| 22. | సమస్యలు ... ... ... | 97 |
| 23. | ఆటవిడుపు పద్యములు ... ... ... | 98 |

# ఆంధ్రవాచకము

నాల్గవ తరగతి.

## 1. సింహము.



సింహ మడవిజంతువు. ఇది పిల్లిజాతిలోఁ జేరినది. దీని రూపము మిగుల గాంభీర్యమైనది. అందుచే దీనిని మృగరాజందురు. ఇది నాలుగడుగుల యెత్తుండును. దీని శరీరము దీర్ఘముగా నుండును. చర్మము పసుపుపచ్చ వన్నెఁ గలిగి యుండును. దీనితలనుండి వెండ్రుకలు గుంపులు గుంపులుగ వ్రేలాడుచుండును. వీనికిఁ గేసరములని పేరు. ఇట్టి కేసరములు కలది కనుకనే దీనిని కేసరి యందురు. దీని కన్నులు పచ్చగా నుండును. అందుచే దీనిని హర్యక్షు మందురు.

పిల్లికివలె దీనికిని మీసము లుండును. దీని నాలుక యాకు రాయివలెఁ గఱుకుగా నుండును. దీనిగోళ్ళు వంకరలు తిరిగి మిక్కిలి వాఁడిగా నుండును. వేఁటాడునపుడీ గోళ్ళను బయటికిఁ దీయును. ఉత్తపుడు కాలియందున్న మెత్తని మాంస పిండము లోనికి ముడిచి యుంచును. అందుచే నిది నడచు నపుడు భూమికిఁ దగిలి గోళ్ళు మొన లరుగ నేరవు. సింహ మడుగిడునప్పుడు చప్పుడు కానేరదు. దీనికిఁ దోఁక పొడవుగ నుండును. దాని చివర వెండ్రుకలు కుచ్చుగా నుండును. ఆఁడు సింహమునకుఁ గేసరము లుండవు. అందుచే నాఁడు సింహమును నిష్కేసరి యందురు.

పగటివేళఁ బరుండి నిద్రబోవును. రాత్రుల యందు వేఁటాడును. సింహముచే వేఁటాడబడు జంతువు లన్నియు నెక్కుడు వేగముతోఁ బరుగిడి పోగలవు. వానిని వెంబడించి పట్టుకొననేరదు. కాఁబట్టి మెల్లగాఁ బ్రాకిపోయి హఠాత్తుగా గర్జనము చేయుచు వానిపై దుముకును. ఇది నీటిపట్టులయందు జంతువులకై వేచి యుండును. ఇది నిప్పునుఁ జూచి భయపడు స్వభావము గలది.

ఇది మాంసముఁ దిను జంతువగుటచేత మృగములను జంపి భక్షించుచుండును.

ఆఫ్రికా, ఆసియా ఖండముల యందలి యత్యుష్ణ ప్రదేశములయందిది నివసించును. ఆఫ్రికా ఖండమందలి

సింహములు మిగుల బలిష్ఠముగను, క్రూరముగ నుండును.

అర్థములు:—నిష్కేసరి = కేసరములులేనిది, అత్యుష్ణప్రదేశము = మిగులవేఁడి గలతావు, హఠాత్తు = ఆకస్మికము, వేచి = కాచుకొని, క్రూరము = దుష్టస్వభావము.

---

## 2. ఆంద్రోక్లీసు, సింహము.



ఆంద్రోక్లీసను నొక బానిసీఁడు కలఁడు. వాని యజమానుఁడు కడుఁగ్రూరుఁడు. అతఁడు మిగుల హేయములగు

పనులు చేయించుచు వానిని మిగుల బాధింప సాగెను. అయినను వాఁడు మిగుల శాంతముతో నాకడగండ్ల నెల్ల నోర్చి పనిఁజేయుచుండెను. ఇట్లు కొంతకాలము జరిగిన పిమ్మట నాయజమానుఁ డేలకో కోపోద్రేకుఁడై వానిని వెంటనే చంపునట్లాజ్ఞాపించెను. ఆతఁడా మృత్యువు బారి నుండి తప్పించుకొని పాఱిపోయి యాఫ్రికాఖండములోని లిబియా యెడారిని జేరెను. మార్గాయాసముచేత నలసిన యొడలి తోడను, వడదాఁకులచే నెండిన పెదవులతోడను, దప్పిక చేతఁ బిడుచగట్టిన నాలుక తోడను, ముందడుగు పెట్టుటకు శక్తిలేక యొక్కడనైనా చల్లని నీడగలచోటు దొఱకునాయని వెదకుచుండ నెదుట గుహయొక్కటి వానికిఁ గాన్పించెను.

కడుబడలి యున్న తన దేహము నెట్టులో నతఁడా గుహనుఁ జేర్చెను. వెంటనే కేసరియొకటి గర్జనముఁజేయుచు వానిని సమీపించెను. అతని గుండెలు చెదిరి ప్రాణములు కడఁబట్టెను. కాని యాసింహము దీనమగు కంఠ ధ్వనితో నతని దరిఁజేరి తన కాలిని యెదుటనుంచి చికిత్స చేయుమను నభిప్రాయములు తెల్పుచు విన్ననగు దృష్టితో వానివైపు చూచెను. ఆబానిసీఁడు భయముచేఁ జేతులు వడఁకఁదొలుత నేమియుఁ జేయఁజాలక పోయినను నెట్టకేలకు మనసు దిట్ట పఱచుకొని దాని కాలి గాయమందు దిగిన ముల్లును నూడఁ బెఱికెను. ఆ గాయమునకుఁ దగిన వైద్యముఁ జేసి దానిని

నెమ్మదింపజేసెను. నాటనుండి సింహము పూర్వము వలెనే స్వేచ్ఛగాఁ దనపాదమును భూమిమీఁద మోపి నడువగలిగెను.

ఆ సింహము వాఁడు చేసిన మేలునకుఁ గడుసంతసించి వేఁటాడి మాంసమును దెచ్చి వానికిఁగూడఁ బెట్టుచుండెను. ఇట్లు వారిరువురకు నత్యంతమగు మైత్రి సంఘటిల్లెను.

కొంతకాలమైన పిమ్మట నాయజమానుఁడు నలు దిక్కులకుఁ దన సేవకులను బంపి యాంద్రోక్లీసును పట్టి తెప్పించెను. తాను విధించిన మరణశిక్షనుండి తప్పించుకొని పోయినాఁడని యనుమానించిన కోపముతో, "వీనిని సింహమునకు నెఱగా విడువుఁడు" అని తన భటుల కాజ్ఞ యిచ్చెను. అంత వారు వాని నొకింత దూరమునఁ బట్టబైట నిలువఁబెట్టి యంతకుఁ బూర్వము మేతలేక యాఁకలిగొని నకనకఁ బడుచున్న సింహమును బోనునుండి తీసి వానిపైఁ గవియించిరి. అది యతివేగమున గర్జించుచు వానిపైఁ బడి మ్రింగబోయెను. ఆహా! ఏమి వింత! ఆ పురుషుఁడు తనకింతకుమునుపు చికిత్సచేసి గాయము మాన్పిన మహోపకారి యని యది గ్రహించి వాని పాదములపొంతఁ బిల్లి పిల్లవలె బరుండెను.

అచ్చట గుంపుగూడి యున్న జనుల నివ్వెరపాటు నెంతని వర్ణింప నగును! ముక్కున వ్రేలిడుకొని చిత్తరువు బొమ్మలవలె నిశ్చేష్టులయి యుండిరి. "ఆహా! క్రూరమగు

సింహమే రక్షించినది. అయ్యో ! మానవజన్మ మెత్తియుఁ దోడివానిని క్రూరవృత్తితోఁ జంపఁబూనితి" నని యా యజమానుఁడు సిగ్గుజెందెను. ఆంద్రోక్లీసును శానిసతనము నుండి యూతఁడు విడిచి పుచ్చెను.

అర్థములు:— హేయము = అసహ్యము, కోపోద్రేకుఁడు=కోపాతిశయము గలవాఁడు, స్వేచ్ఛ = తనయిష్ట ప్రకారము, మైత్రి = స్నేహము, నిశ్చేష్టులు= మొద్దుబారిన శరీరముగలవారు, మహోపకారి=గొప్ప యుపకారముచేసినవాఁడు.

---

# 3. మార్కండేయుఁడు.

మృకండుఁడను మహర్షి చాల నిష్ఠగలవాఁడై చిర కాలము శివునిఁ గూర్చి తపస్సుచేసెను. శివుఁడు వానికిఁ బ్రత్యక్షమై "ఓయీ ! నీతపమునకు మెచ్చుకొంటిని. నీకేమి వరముకావలయునో కోరుకొనుము. దానిని బ్రసాదించెదను" అనగా నామహర్షి, "ఓమహాదేవా ! నేను సంతాన హీనుఁడనై యున్నాను. సంతానము లేనివానికి మోక్షము లేదుకదా ! కాఁబట్టి నాకు సంతానమును బ్రసాదింపుము" అని ప్రార్థించెను.

పిమ్మట నాహరుఁడు "చిరాయువుఁ గలిగి వైధవ్యము ననుభవించు పుత్రిక కావలయునా ? లేక అల్పాయువుఁగలిగి

గుణాఢ్యుఁడైన పుత్త్రుఁడు కావలయునా!" అని యడుగ నామని 'ఓ దయానిధీ! పుట్టిచచ్చినను పుత్త్రుఁడే మేలు' అనునట్లు అల్పాయు వయ్యును గుణవంతుఁడైన కుమారునే దయచేయుము" అని వేఁడుకొనెను. వానికా వర మొసఁగి శివుఁ డంతర్ధాన మయ్యెను.

అంత గొంత కాలమునకు మృకండునకుఁ బుత్త్రుఁడు గలిగెను. మృకండుని పుత్త్రుఁడు గాన మార్కండేయుఁ డని పేరిడి, తల్లిదండ్రులు వాని నల్లారు ముద్దుగాఁ బెంచుచుండిరి. వాని ముద్దుమాటలు వినుచు, వాని యాటలు చూచుచుఁ బ్రమోదము నొందుచుండిరి. కాలక్రమమునఁ బిల్లవాఁడు పెరిగి పదునాఱేండ్ల బాలుఁడయ్యెను. తల్లి వాని కొకనాఁడు భోజనము పెట్టుచుండగా యమభటులు వచ్చి "ఓ మార్కండేయా! నీకాయువు మూఁడినది. మా ప్రభువగు యముఁడు నిన్నుఁ గొనిరమ్మని యాజ్ఞయొసఁగెను. మేము యమ కింకరులము. ఇదె నిన్నుఁ గొనిపోయెదము" అని పలికిరి.

ఆ మాటలు తలిదండ్రుల మనస్సులకు శల్యములై బాధింప నాపిల్లవాని దగ్గఱగాఁ దీసికొని మిగుల దుఃఖింప సాగిరి. ఆ బాలుఁడు తల్లిదండ్రులు పడు దుఃఖమును జూడజాలక కడు వగచి ఎట్టకేలకు ధైర్యము నవలంబించి "జననీ జనకులారా! ఏల యిట్లు దురపిల్లెదరు? ధైర్యమును జిక్కఁబట్టుఁడు, భక్తవత్సలుఁడగు నాపరమేశ్వరుఁని గూర్చి

తపస్సు చేసి యధికమగు నాయువును బడసి వచ్చెదను.'' అని తనవారి వీనులకు విందుగాఁ బలికి యమభటులకుఁ జిక్కకుండుటకై యొక శివాలయమునందుఁ జొచ్చి యమ్మహాదేవునిఁ గూర్చి గాఢమగు తపముఁ గావింపసాగెను.

అతనిచే దిరస్కరింపఁబడి యమభటులేగి యాసమాచారమును తమ ప్రభువునకుఁ దెలిపిరి. అతఁడు క్రోధమున భగ్గున మండిపడి వాహనమగు నెనుబోతుఁ నెక్కి పాశమును



చేతఁగొని యాకుఱ్ఱవాఁడుండు నాలయముఁ జేరి పాశమును వాని కంఠమునకు వేసి తిగువఁ జొచ్చెను.

ఆ బాలుఁడా శివలింగమును తన బాహువులచే గట్టిగ బిగియఁబట్టి "హరా! శంకరా! చంద్రశేఖరా! ననుగావవే." అనుచుఁ గడుభక్తినిఁ బ్రార్థింపసాగెను. భక్తవత్సలుఁడగు నా శంకరుఁడా చిన్నవాని రక్షింపనెంచి యా లింగమునుండి నిజరూపముతో వెలువడి తన భక్తుని బాధించు యముని త్రిశూలముచేఁ బొడిచి సంహరించెను. పిమ్మట నా బాలుని భక్తికి ప్రసన్నుఁడై "నీకేమివరము కావలయును?" అని యడిగినంతనె మార్కండేయుఁడు "ఓదేవా! ఈశరీరము తోడనే అనేక యుగములు బ్రతుకునట్లు కరుణింపుము" అని వేఁడుకొనెను. పరమేశ్వరుఁడు వాని కా వర మొసంగెను.

అంతట బ్రహ్మాదిదేవతలు వచ్చి "ఓశివా! మహాదేవా! జీవులు చేసిన పాపములఁ బరిశీలించి దండించు దండధరుని నీవిట్లు రూపుమాపుటచేఁ బ్రేతపురము పాడుపడి యున్నది. కాన నీధర్మదేవతను బ్రతికించి ధర్మస్థాపనము చేయుము" అని ప్రార్థించిరి.

అందులకు శివుఁడు ప్రసన్నుఁడై ప్రేతపతిని బ్రతికించి దేవతలకుఁ బ్రీతి నొనఁగూర్చెను. యమధర్మరాజు శివునిం బ్రార్థించి సెలవుఁగైకొని తన లోకమునకుఁ బోయెను. బ్రహ్మాదులును తమ తమ లోకములకుఁ జనిరి. పరమేశ్వరుం డదృశ్యుఁడయ్యెను. పరమేశ్వరుని దయామహిమచేఁ జిరంజీవియై మార్కండేయుఁడు తనపురమునకుఁబోయితలిదండ్రుల

యదుగులకు నమస్కరించి, యీశుభవార్తను దెలిపి వారి నానందసముద్రమున నోలలాడించెను.

కాఁబట్టి పరమేశ్వరుని భక్తిచే దుర్లభమగు వానిని గూడఁ బడయనగును.

అర్థములు:—హరుఁడు = శంకరుఁడు, అంతర్ధానము=అదృశ్యము, ప్రమోదము = ఆనందము, భక్తవత్సలుఁడు = భక్తులపై ప్రేమగలవాఁడు, పాశము = త్రాడు, బాహువులు = భుజములు, ప్రేతపురము = యమలోకము, దుర్లభము = లభింపనిది.

# 4. కుచేలుని దారిద్ర్యము.

కుచేలుఁడను నొక విప్రుఁడుగలఁడు. అతఁడు పరమ శాంతుఁడు. మానమే ధనముగాఁ గలవాఁడు. ధర్మకార్యములయందుఁ గడు బ్రీతిఁ గలవాఁడు. పరమేశ్వరునకు నాంతరంగిక భక్తుఁడు. తాను గడు పేదఱిక మనుభవించుచున్నను నితరులను దీనుఁడై యాచింపక తనకుఁ బ్రాప్తించిన దానితోడనే తృప్తి నొందుచుఁ దన యాలుబిడ్డలను బోషించుకొనుచుండెను. కుచేలుఁడనగా చినిగిన బట్టలుగలవాఁడని యర్థము.

అతనిభార్యగుణమణి, మహాపతివ్రత. తనవిషయమును లెక్కఁగొనక, యున్న యాహారపదార్థములను తనభర్తకును

బిడ్డలకును బెట్టుచుఁ గాలముఁ గడుపుచుండెను. కడుపారఁ దిండి లేకపోవుటచేతఁ బిల్లలు కడుపుచిచ్చుచే మలమల మాడుచుఁ దల్లిని జుట్టుముట్టి "అమ్మా! ఆకఁలి వేయుచున్నది. నిలువలేము. పట్టెడన్నముఁ బెట్టుము" అను దీనవాక్యము లామె మనస్సునకు ములుకులగుచు బాధింప, నొకనాఁడు తన పతిని సమీపించి "నాథా! ఈ పేదఱికమునకుఁ గడ గానరాక యున్నది. ఈ శిశువులను సంరక్షింపలేక యున్నాను. తిండి లేమిచేత బిల్లల యెముకలుఁ బయటఁ బడినవి. ప్రాణములు కన్నులలో నిలిచి యున్నవి. ఈ పేదఱికమునుండి మమ్ము నుద్ధరించు




నుపాయము నాలోచింపుఁడు. ద్వారకావాసుఁడగు శ్రీకృష్ణుఁడు మీ చిన్ననాటి చెలికాఁడని చెప్పుచుందురు

గదా! ఆ మహానుభావుని నాశ్రయించి, యీ కష్టములనుండి విముక్తులను గావింపుము. ఆ శ్రీకృష్ణుడు దీనపోషకుడు. మీవంటి భక్తులయెడల మితిలేని వాత్సల్యము గలవాడు. ఆతడు కుశస్థలీపురమునం దున్నాడు. మిమ్మును జూచిన వెంటనే యమితములగు సంపదల నొసంగును" అని పలికెను.

అంతట కుచేలుడు సతి పలుకులను విని సంతసించి యీ వాసుదేవుని దర్శన మిహపరలోక సాధనమని యెంచి ద్వారావతికిం బోవ సమకట్టి "పరమేశ్వరుని దర్శింపఁబోవు నపుడు రిక్తహస్తములతోఁ బోరాదు. కానుక యేమైనఁ గొనిపోవలయును. ఏమి యున్నఁ" దని పలికెను. వెంటనే యాసుదతి పిడికెడటుకులు విభుని యుత్తరీయము కొంగున ముడిచెను. పిమ్మట కుచేలుఁ డత్యుత్సాహముతో బయలు వెడలెను. పోవునపుఁ డతఁడు "నేను నిరుపేదను. ఆ శ్రీకృష్ణుఁడు సకలైశ్వర్య సంపన్నుఁడు. ఆయనను దర్శించు టెట్లు? ద్వారపాలకులు నన్ను లోనికిఁ బోనిచ్చెదరా? కాసులేనివాఁడను. వారిదయబడయు టెట్లు? ఆ భగవంతుని దయయే నా భాగ్యము. అతఁడే నాకుఁ శరణ్యము. నన్నేల యుపేక్షించును?" అనుకొనుచుఁబోయి ద్వారకకుఁ జేరెను.

రాజమార్గమున బోవుచు నెదుటఁ గాన్పించు మేడలు మిద్దెలు చూచి కుచేలుడు బ్రహ్మానందము నొందెను.

అందొక సౌధమునఁగో హంసతూలికా తల్పమున నున్న శ్రీకృష్ణుఁడు పేదవిప్రుఁడైన కుచేలుని మొఱ యాలించి తల్పమునుండి దిగి ఎదురుగాఁబోయి వానినిఁ గౌఁగిలించుకొని




మిక్కుటమగు నాదరముతోఁ గొనిపోయి బంగారు పీఠమున గూర్చుండఁ జేసి పాదములను గడిగి యాజలమును శిరమున జల్లుకొనెను. వాని శరీరమంతటను మంచిగంధమును బూసి విసనకఱ్ఱచే వీచుచుఁ గుశలమడిగెను.

పరమేశ్వరుఁ డిట్లు తన కుపచారములు సేయుచుండ సంతోషమునఁ గుచేలుని దేహము పులకరించెను. కన్నులనుండి యానంద బాష్పములు కురిసెను. అట్టియెడ రుక్మిణీదేవి వింజామరఁ బూని విసరుచుండెను. అంతఃపుర స్త్రీలా బ్రాహ్మణునిఁజూచి "ఆహా! ఇతఁడేమి పుణ్యము చేసికొని పుట్టెనో కదా! శ్రీకృష్ణుఁడు రుక్మిణీదేవియు వీని కుపచారములు సేయుచున్నారు" అని వింతపడుచుండిరి.

శ్రీకృష్ణుఁ డాకుచేలుని కరమును తనకరమునను౦చుకొని "మిత్రమా! నీభార్య నీకనుకూలముగ వర్తించునదియేనా? నీపుత్రుల కందఱకును సేమమా? నీవీ ప్రపంచ సంబంధమగు సుఖములన్నియు ననిత్యములని నమ్మి యెల్లప్పుడు నన్నే సేవించుచున్న యుత్తమ భక్తుఁడ వని నే నెఱుఁగుదును." అని వానిగుణములను వినుతించుచు "మిత్రమా! మన మొకనాఁడు గురుపత్నిచే నియుక్తులమై సమిధలకొఱకడవికిఁ బోయితిమి. జ్ఞాపకమున్నదా? అట్టియెడ కాఱుమబ్బు లాకాశ మంతటనుఁ గప్పియుండెను. పెద్ద గాలి భోరున వీవ జంతువులు భయపడి పాఱఁజొచ్చెను. కన్నులకు మిఱుమిట్లు గొలుపుచు మెఱుపులు మెఱయ సాగెను. ఏనుఁగు తొండము వడువున జడి గురియ నారంభించెను. అంతటఁ బ్రొద్దుఁ గ్రుంకెను. కన్ను కన్ను కానరాని కటిక చీఁకటి వ్యాపించెను. ఇది మిఱ్ఱు, ఇది పల్లమనియు, ఇది

బయలు, ఇది సందనియు నేర్పఱుప రాకయుండెను. అప్పుడు మన మిరువురము చేయిఁ జేయి పట్టుకొని నడచుచు, నెడ తెగక వీచు నా చలిగాలికి గడగడ వడఁకుచు నా రేయి యెటులో కడపితిమి.

తెల్లవాఱఁగనే గురువులగు సాందీపులు మనలను వెదకుచు వచ్చిరి. వానదెబ్బచే వలిఁగొని శ్రమనొందియున్న మనలఁ గాంచి "అయ్యో! శిష్యులారా! యిమ్మహాటవిని నడురేయి పడరాని యిడుమలఁ బడితిరి గదా? ఇంతు మూలమున మా ఋణముఁ దీర్చుకొంటిరి. ధనధాన్యములతోఁ దులఁదూగుచుందురు గాత! అనేకులగు పుత్రులను బడయుదురుగాత! దీర్ఘాయువు నొందుదురు గాత! యనుచు దీవించి, యెంతయో వాత్సల్యమున మందిరమునకుఁ గొని పోవుట నీకు జ్ఞాపక మున్నదా?" అని చిన్ననాఁటి వృత్తాంతముల నెన్నింటినో జ్ఞప్తికిఁ దెచ్చుచున్న వాసుదేవుని యనుగ్రహ విశేషమునకు సంతసిల్లి "దేవా! పదునాలుగు లోకములకు గురుఁడవగు నీకు గురువనుచు నొకఁడు గలఁడా!" అని ప్రశంసింప మొదలిడెను.

అర్థములు:—కడుపుచిచ్చు=ఆకలిమంట, దీనవాక్యములు = జాలిమాటలు, వాత్సల్యము = ప్రేమ, సకలైశ్వర్య సంపన్నుఁడు = అన్ని భాగ్యములు గలవాఁడు, పులకరించు = గగుర్పొడుచు, నియుక్తులు = ఆజ్ఞాపింపఁబడినవారు, మిట్టు=మిట్ట, ప్రశంసింపన్ =కొనియాడుటకు.

# 5. కుచేలుని యైశ్వర్యము.

శ్రీకృష్ణుఁడు వాని మాటలు విని చిఱునవ్వు నవ్వి, “నీవు నన్ను జూడవచ్చినపుడు నాకేమి కానుకఁ గొనివచ్చితివి?




నా యందుఁ గల్మషము లేని భక్తిఁ గలవాఁ డొసంగిన తృణమైనను మేరువుగ నంగీకరింతును. భక్తిలేని వాఁడిచ్చు

మేరువైనను తృణీకరింతును. ఆంతరంగిక భక్తులొసంగు పత్రమైనను, పుష్పమైనను, ఫలమైనను, తోయమైనను మిగులఁ బ్రీతితో గ్రహించెదను'' అనుచుఁ బలుక, నా పరమేశ్వరునియందు బుద్ధినిలిపి మాఱుపలుక వెఱచి అటుకులనుబెట్ట లజ్జించి కుచేలుఁడు కూర్చుండి యుండెను.

శ్రీ భగవానుఁడగు నా వాసుదేవుఁడు కుచేలుఁడు వచ్చినపని నెఱింగినవాఁడు, గనుక "ఈతఁడు కేవలము ధనమునుగోరి నాయొద్దకు రాలేదు. తన భార్యను సంతోషపెట్ట నెంచి వచ్చి యున్నాఁడు. ఇతనికి విశేషముగు సంపదలిప్పుడే యీయవలెను" అని యెంచి, తెచ్చిన యటుకులను స్వామికి నర్పింప నేరక సిగ్గుచే మోము వంచుకొని యున్న కుచేలుని చినిఁగిన వస్త్రపు చివర ముడిచి యున్న యటుకుల నొక గుప్పెడు పుచ్చుకొని " ఇవి ముల్లోకములను, నన్నును దృప్తి నొందింపగలవు" అనుచుఁ, గడువేడుకతో వానిని భుజించెను.

కుచేలుఁడా రాత్రి ముకుందుని మందిరమున సుఖంబుగ విందారగించి, మెత్తనిపాన్పుపైఁబరుండి, మైమఱచి నిద్రించెను. మఱునాఁడు వేకువను లేచి కాల కృత్యములను దీర్చి తన ముని పల్లెకు బోవఁ బయన మయ్యెను. గోవిందుఁ డాతనిఁ గొంతదవ్వు సాగనంపెను. కుచేలుఁడు తన మనమున "ఆహా! యేమి నా యదృష్టము! ఆపురుషోత్తము నీ కన్నులతోఁ జూడఁగలిగితిని. గర్భదరిద్రుఁడనగు నేనెక్కడ! లక్ష్మీభర్త

యగు నావెన్నుఁడెక్కడ! నన్ను తన సోదరునివలె మన్నించి తన శయ్యామీఁదఁ గూర్చుండఁ జేసెను. తన సతీమణియగు రుక్మిణి చామరమువీవ వాత్సల్యమున నాపాదములను గూడఁ దానియొత్తెను. ఇట్లెన్నివిధముల గౌరవించినను నాకు సంపద లిచ్చినజాడయేమియుఁ గానరాదయ్యెను. సంపదలిచ్చిన యెడల




భక్తులు దరిద్ర్యమం దాసక్తిఁ గలవారై తనకు దూరు లగుదురని కాఁబోలు! నట్లు గావించెను. ఆశ్రితుల

యార్తిని దొలఁగించు నామహానుభావునకు నాబోటివానికి సంపదల నిచ్చుట యన నెంతపాటిది? నామేలు కోరియే మురహారి సిరి నొసఁగఁడయ్యెను" అని తలపోయుచుఁ దన మునిపల్లెనుఁ జేరబోయెను.


అతఁడు తనయెదుట విశాల రమణీయమగు నొక్క భవనమును గాంచెను. "ఇది యేపుణ్యాత్మునిదో" యని కుచేలుఁడు విస్మయము నొందసాగెను. అట్టి యవసరమునఁ గుచేలుని భార్య భర్తరాక విని కడుహర్షించి చెలికత్తెలు గొల్వ నెదురుగాఁ బోయి పతి పాదములకు మ్రొక్కి యత్యంత భక్తితోఁ గొనిపోయి హంసతూలికా తల్పముపైఁ గూర్చుండఁబెట్టి బూజించెను.

కుచేలుఁడు పరమేశ్వరుని కటాక్షమునకు మిగుల సంతసించుచు సమస్త సుఖముల ననుభవించెను. అయినను మనస్సు నీశ్వరాధీనము చేసి భక్తిసలుపుచు తుదకు మోక్ష పదవి నొందెను.

నిష్కల్మషులగువారికిఁ బరమేశ్వరుని యందలి భక్తి భుక్తి ముక్తుల నిచ్చుననుట కీ కథయే దృష్టాంతము.

అర్థములు:—కల్మషము=కళంకము, తోయము=జలము, దవ్వు=దూరము, గర్భదరిద్రుఁడు = పుట్టుకతో బీదవాఁడు, మురహరి = కృష్ణుఁడు, విస్మయము = ఆశ్చర్యము, కటాక్షము = కడగంటి చూపు, నిష్కల్మషులు = పాపము లేనివారు.

# 6. నక్క.



నక్క రూపమునందు కుక్కను బోలియుండును. కాఁబట్టి నక్క కుక్కజాతిలోఁ జేరిన దనవచ్చును. ఇది యూరి వెలుపల బయళ్ళయందును, నడవుల యందును నుండును. ప్రొద్దు గ్రుంకఁగానే నక్కకూయుట కారంభించును. రాత్రులయందుఁ గూయుటచేత దీనికూత పిన్న వాండ్రకు మిగుల భయంకరముగా నుండును.

దీని శరీరము రెండు మూఁడడుగుల పొడవుండును. దీనితోఁక పొడుగుగనుండి చివర కుచ్చును గలిగియుండును. దీని కంటిపాపలు గుండ్రముగా నుండును.

నక్కలు గుంపులు గుంపులుగా దిరుగు చుండును. అప్పు డప్పుడు విడి విడిగను, జంట జంటలుగను గూడ సంచరించు చుండును. నక్కలు సాధారణముగా నేల

బొఱియలలో నివసించి యుండును. కాని వేసవికాలమందు వేఁడిని సహింపలేక నీటిలో నుండును.

ఇవి పగలు మనుష్యుని కంటబడకుండ సంచరించును. రాత్రులయందు దిరుగాడుచు కోళ్ళు మేఁకపిల్లలు మొదలగు వానిని దొంగతనముగాఁ గొనిపోయి తినుచుండును. ఇది శ్మశాన భూముల యందుఁ దఱచుగ నుండుట చేతఁ బాతి పెట్టిన శవములను బెకలించి పైకిఁ గొనివచ్చి తినును. నక్కలు చెఱకు తోఁటలను గొట్టివేయును. నక్క కొట్టిన చెఱకు కట్టియు, చిలుక కొట్టిన పండును చాల తీయగ నుండునని యందురు.

నక్కలలోఁ బెద్దనక్కలు, గుంటనక్కలు అని రెండు జాతులు గలవు. గుంటనక్క రెండడుగుల పొడవునకు లోఁపుగ నుండును. దీని చెవులు పెద్దవి. దీని కంటిపాపలు వెలుతురునందు చీలి సన్నగిలి కోలగ నుండును. కాని పెద్దనక్కలకవి గుండ్రముగానే యుండును. ఈజాతి నక్కలకు మోసముచేయు నేర్పెక్కుడుగ నుండును. ఇవిపీతలు, నత్తలు, ఎలుకలు మొదలగు వానిని దిని బ్రతుకును.

ఇవి టక్కరి తనముచేత వేటఁగాండ్రను, వేటకుక్కలను గనుఁబ్రామి తప్పించుకొని పోఁగలవు. అందుచేతనే నక్కకు జిత్తులమారి యని పేరువచ్చినది.

**అర్థములు:**— శరీరము=దేహము, టక్కరితనము=మోసము, పీతలు=ఎండ్రకాయలు, కోలగ = పొడవుగ.

# 7. ప్రహ్లాదుని విద్యాభ్యాసము.

ప్రహ్లాదుఁడు హిరణ్యకశిపుఁడను రాక్షసుని కుమారుఁడు. ఈతఁడు దైవభక్తులలో మొట్ట మొదటి వాఁడుగఁ బరిగణింపఁ బడినవాఁడు. అన్ని భూతములయందు దయఁగలవాఁడు. పెద్దలను గౌరవించువాఁడు. దీనులయెడ వాత్సల్యముఁ గలవాఁడు. చెలికాండ్రను సోదరులవలె చూచువాఁడు. గురువులను దైవములని యెన్నువాఁడు. నవ్వులకైన బొంకి యెఱుఁగనివాఁడు. చక్కదనము, ధనము, వంశము, విద్యయు కలవాఁడైనను, గర్వమను మాట లేనివాఁడు. మహారాజు కుమారుఁడై, సమస్తమగు సౌఖ్యములు గలవాఁడైనను, అవి అనిత్యములని తెలిసి వానిచే మోహితుఁడు గాకుండెను. వేయి చెప్పనేల! అతని యందన్ని సద్గుణములు చేరి యున్నవని చెప్ప నొప్పును. ఈతఁడు రాక్షసుఁడే యైనను శత్రువులగు దేవత లందఱు నతని గుణములను బొగడుచుండిరి.

ప్రహ్లాదుఁడు నీరు త్రావు నపుడును, అన్నమును దినునపుడును, తిరుగునపుడును, ఇతరులతో మాటలాడునపుడును కాలమును వ్యర్థపుచ్చక పరమేశ్వరుని ధ్యానించు వాఁడు. ఇట్లు పరమభక్తిని మెలగుచు లోకులకుఁ బిచ్చివాని

వలెఁ గాన్పించుచుండెను. తండ్రియు. నీతఁడు మందబుద్ధియని తలఁచి వానికి విద్య నేర్పించినగాని తీవ్రబుద్ధి కలవాఁడు




కానేరఁడని యెంచెను. ఒకనాఁడు తన ప్రియపుత్రుని జేరం బిలిచి "తండ్రీ! విద్య యజ్ఞానమును బోఁగొట్టును. చదివిన వానికి మంచిచెడ్డలుఁ బాగుగ విభజింపఁగల శక్తిఁగలుగును. కాబట్టి నిన్ను జదివించెదను. చదువుకొనుము" అని యొత్తి చెప్పి, తన పురోహితుఁడగు శుక్రాచార్యులవారి పుత్రుఁడగు చండామార్కులను పిలిపించి "అయ్యలారా! నాకుమారుఁడగు ప్రహ్లాదుఁడు విద్యాగంధములేక గ్రుడ్డివానివలె నున్నాఁడు. నాప్రతాపాదులు లేశమైనను వీనికిలేవు. మీరు మాకు

గురువులు. దయాసముద్రులు. నన్ను మన్నించి యీపిన్న వానికి నీతి విద్యను గఱపి రక్షింపుఁడు" అని పలికి వారి కప్పగించెను.

వారలాపిల్ల వానిని గొనిపోయి నీతి శాస్త్రమును చక్కఁగఁ బఠింపఁజేసిరి. ప్రహ్లాదుఁడు భగవంతుని భక్తిని వీడకయే యాశాస్త్రమును బఠించెను. హిరణ్యకశిపుఁడు తనలో "తన కుమారునకు గురువులెట్లు బోధించిరో, బాలుఁ డేరీతిని బఠించెనో చూచెదను గాక" యని తలంచి వానిని బిల్వఁబంపెను. ప్రహ్లాదుఁడు రాగా వానిని దన తొడలపైఁ గూర్చుండఁబెట్టుకొని, ముద్దాడి, "వత్సా! గురువులయాజ్ఞను మీఱక వేదములను, రాజనీతిశాస్త్రము మొదలగు వానిని చక్కగా జదివితివా? నీకేది చక్కగా దెలియునో దానిని జెప్పుము" అని యత్యుత్సాహముతోఁ దండ్రి యడుగఁ బ్రహ్లాదుఁడు "తండ్రీ నాకుఁ జక్కఁగా దెలిసిన యంశ మేమన, శాస్త్రములుశ్రమపడి చదువుట వలన ఫలములేదు. అవి యమదండనము తొలగించి సుఖము నీయఁజాలవు. కాఁబట్టి ఎల్లప్పు డావిష్ణుభక్తి గలిగి యుండిన మేలు గలుగును" అనెను. ఆ మాటలు విని నవ్వుచుఁ దండ్రి "కుమారా? నీ మాటలు నాకు వింతలుగ నున్నవి. నీకు దోఁచెనా! లేక యెవరైన దుర్నీతులు గఱపినారా? రాక్షసుల మగు మనకు విష్ణుమూర్తి శత్రుడని యెఱుఁగవా? అట్టివానిని

హరి గిరియని స్మరింప నీ కేల? ఈదుర్బుద్ధి చండామార్కులు కలుపలేదు గదా! అటులే యుండవచ్చును. పసిబాలుర కేమి తెలియును? ఎవరెటులు బలికిన వారట్లు పలికెదరు" అని



యూహించి రాజు పురోహితుని పుత్రులను కోపమునం జుఱచుఱఁ జూడ, చండామార్కులు ప్రహ్లాదునితో "పిల్లవాఁడవు, ఐదేండ్లవాఁడవు, మేము చెప్పిన శాస్త్రముల లోని యంశమును రవ్వంతైనఁ జెప్పకుంటివి. మీతండ్రి యెదుట మాకెంతయుఁ దలవంపు తెచ్చిపెట్టినాఁడవు. మారాజునకు శత్రుఁడవుగాని, పుత్రుఁడవుగావు. చక్కని రాక్షసవంశమున తులసివనములో గంజాయి మొక్కవలె

బుట్టినావు. ఇదిగో చూడు! నిన్నుఁ బట్టి కొట్టి శిక్షించెదము. రారమ్ము" అని వానిని దండ్రి సమ్ముఖమునుండి కొనిపోయిరి.


అర్థములు:— భూతములు = జీవములు, ప్రతాపము = పరాక్రమము, అత్యుత్సాహము = మిగుల వేడుక, స్మరించుట = తలంచుట, సమ్ముఖము = సన్నిధి.

# 8. ప్రహ్లాదుని భక్తి.

పిమ్మట రాజకుమారునికిఁ గావలసిన యంశముల నన్నింటిని బోధించి తాముఁ జెప్పిన నీతినే రాజు నెదుటఁ బలుకునట్లును, విష్ణుకథల నెంతమాత్రముఁ జెప్పకుండు నట్లును బ్రహ్లాదునికి బోధించి బుజ్జగించి మరల దానవరాజు చెంతకుఁ గొనిపోయిరి.

ప్రహ్లాదుఁడు 'శ్రీహరీ' 'శ్రీహరీ' యని విష్ణువును భజించుచు, గురువు వెంటఁజని తండ్రిపాదములకు నమస్కరించి చేతులు జోడించుకొని నిలిచి యుండెను. రాజు తన కుమారుని దీవించి కౌఁగిలించుకొని తొడలపైఁ గూర్చుండఁ బెట్టుకొని, "అన్నా! నీకు గురువు లేమిక అపిరి; నీ వేమి నేర్చితివి? చాలకాలమైనది. వినఁగోరెదను. నీకుఁ దెలిసిన నీతిశాస్త్రము లోని పద్యమొక్కటి చదివి దాని తాత్పర్యమును చెప్పుము. నీతోఁ గూడఁ జదువుచున్న రక్కసి బాలురు నిన్ను

మించియున్నారు. నీతి శాస్త్రమందు నీకుఁ గూడ వారి కున్నంత కుశలత యెన్నఁడు కుదురునాయని యువ్విళ్లూరు



చున్నాను. నన్నుగన్నతండ్రీ! నీవిద్యాధిక్యమును జూపుము" అనవిని యాబాలుఁడు జనకునితోఁ "తండ్రీ! అర్థశాస్త్రము మొదలగున వన్నియును గురువులు చదివించిరి. నేనును చక్కఁగఁజదివితిని. విద్యలన్నిఁటి రహస్యములను గ్రహించితిని. నిరంతరము హరిభజనఁజేయుచు, సజ్జనుఁడై యుండిన మేలు కలుగును. ఆహరిభజన సేయనివారి జన్మము గ్రుడ్డివానికి చంద్రోదయము వలెను, చెవిటివానికి శంఖధ్వని వలెను వ్యర్థమై చనును" అని పలికెను.

ఆ మాటలు తండ్రి చెవులకు ములుకులవలె నాటు కటపట పండ్లుగీటుచు గురుపుత్రునిఁ గాంచి, "ఓయీ!

బ్రాహ్మణవేషధారీ ! నాపిల్లవానికి నీతిశాస్త్రముఁజెప్పెదనని కొనిపోయి దైత్యకుల నాశకుఁడైన విష్ణుదేవుని కథల బోధించిన వాఁడవా ? ఆహా ! నిన్ను నమ్మి యెంత మోసపోతిని! ధర్మమునకు విరోధముగ నడచిన నీబోఁటివానిని పాపము పొందకుండునా ? ఛీ ! నీవు యథార్థపు బ్రాహ్మణుఁడవా?'' అన విని పురోహితుఁడు గడ గడ వణఁకుచు 'దానవనాథా' ! నా వలన నిసుమంతయు తప్పు లేదు. నీయడుగులతోడు. నీ యన్నముఁ దినుచు శత్రుపక్షమును నీపుత్రునికి బోధింతునా ! అట్టి నీచపుఁబని కొడిగట్టెదనా ? నీకుమారుని పాడుచేయుటకు నేనుశత్రుకోటిలోని వాఁడనా? ఇది నీ కుమారునికి స్వభావసిద్ధము. అంతియకాని యితరులు చెప్పిన బుద్ధికాదు'' అనెను.

రాజు గురువుపై కోపముడిగి కుమారుని వంకఁ జూచి "ఓరీ ! డింభకా ! గురువులు చెప్పనిబుద్ధి నాకడుపున బుట్టిన నీకెట్లు పుట్టెనురా ? ఏ దుర్మార్గు లిట్టి యవినీతిని బోధించిరి ? వారిని నాయెదుటఁ జేర్పుఁడుము'' అనెను. ప్రహ్లాదుఁడు "ఓదైత్యచంద్రమా ! హరిభక్తి యనునది పరులు చెప్పిన వచ్చునదియా ? పూర్వ పుణ్యముచేత లభించును. వేయిమాటలేల ! ఆ శ్రీహరిభక్తి యనెడు నావలేక సంసారసముద్రమును దాటుట కెవనికిని వశముగాదు. కాఁబట్టి హరిభక్తి నందఱు తప్పక కలిగి యుండవలయును."

అని పలుకఁగా వెంటనే తన తొడలపై నున్న కొడుకును క్రిందికిఁ ద్రోచి కోపముచే భగ్గున మండిపడి మంత్రులను బిలిచి,

“మంత్రివరులారా! ఈ జనకద్రోహిని చూచితిరా! వీఁడుచూచిన నైదేండ్లవాఁడు. తండ్రినైన నన్ను మన్నింపక తిరస్కరించి రవంతయైన భీతిలేక, నాయెదుట శత్రుఁడగు విష్ణుని భట్టువలెఁ బొగడుచున్నాఁడు. వ్యాధిచేఁ జెడిన యవయవము ఖండించివేసి మిగిలిన యవయవములను గాపాడునట్లీ దుర్మార్గుని నిర్మూలించి వంశమును రక్షింప వలెను. కాఁబట్టి వీనిని గొనిపోయి యిప్పుడ వధించిరండు” పొండని యానతిచ్చెను.

అంత మంత్రులు భయంకర రూపులగు పెక్కండ్రు రక్కసులను బిల్వఁబంపి యీపిల్లవానిని వధింపు మనిరి. ప్రహ్లాదుఁడు పిన్నవాఁడు, సుకుమారుఁ డని యోచింపక రాతిగుండియఁ గలవాండ్రు శూలములు మొదలగు నాయుధ ములతో వాని దేహమును బొడువసాగిరి. అది యెట్టి చిత్రమో కాని వాని దేహ మిసుమంతయుఁ గందలేదు. ముఖకాంతి యావంతయుఁ దగ్గలేదు. శ్రమయన్న మాటయే లేదు. దైత్యులోకమూలఁ దన్ను బాధించుచుండఁ బ్రహ్లాదుఁ డడుగడుగున “ఓశ్రీహరీ! ఓనరహరీ! ఓమురారీ!” అని పరమేశ్వరుని పొగడుచునే యుండెను గాని యొకప్పుడును

గంటను దడిఁబెట్టలేదు. ఎక్కడకుఁ బాఱిపోలేదు. బంధువులను మిత్రులను రక్షింపుఁడని కోరలేదు. ఇట్టి దుర్మార్గపుఁ బనిఁ జేయుచున్నాఁడని తండ్రిని పల్లెత్తుమాట యనలేదు. సంతాపమును బొందలేదు.

ఇట్టి విచిత్ర చరిత్రగల ప్రహ్లాదునిఁ జూచి తండ్రి వింతనొందుచు నొకసారి యేనుఁగులను బెట్టి త్రొక్కించును. వేఱొకసారి నల్లత్రాఁచులచేతఁ గఱపించును. ఒకమాఱు అగ్నిజ్వాలలోఁ ద్రోయించును. వేఱొకమాఱు సముద్రములో బడఁద్రోయించును. ఒకతూరి విషము పెట్టించును. వేఱొకతూరి తీవ్రమగు నెండలో నిలువబెట్టించును. ఒకప్పుడు నవరంధ్రములను బిగియఁబట్టించును. మఱియొకప్పుడు హోరుమని కురియు వర్షములో నిల్వబెట్టించును. ఒకవేళ భూమిలోఁ బ్రాతించును. మఱియొకవేళ నాహారమీఁడక యుంచును. ఇట్లెన్ని మారణోపాయములు పన్నినను ప్రహ్లాదుఁడు చావఁడయ్యెను.

అర్థములు:—కఱపిరి = నేర్పిరి, తాత్పర్యము = పద్యభావము, విద్యాధిక్యము = చదువులలో గొప్పతనము, దైత్యకుల నాశకుఁడు = రాక్షస వంశమును నశింపఁజేయువాఁడు, జనకద్రోహి = తండ్రికి కీడుచేయువాఁడు, శూలము = బల్లెము, మారణోపాయము = చంపెడి ప్రయత్నము.

# 9. నరసింహావతారము.

పిమ్మట రాజు తన మనస్సునందు "ఆహా! ఇదేమి వింత! సముద్రములో ముంచినను, ఏనుఁగులబెట్టి త్రొక్కించినను, ఇంక నెన్ని విధముల బాధించినను వీఁడు చావక యున్నాఁడు. వీని నెట్లు త్రుంపఁగలను! కడు వేసారితిని. వీని ప్రభావము దివ్యమైనట్లు కాన్పించుచున్నది. కావుననే వీనికి భయము లేదు. వీనితోడి విరోధము నాకు మరణహేతువగును" అని చింతింపఁ దొడంగెను. గురుపుత్రులు వాని నోదార్చి గృహస్థులగు రాజులకు బోధింపఁ దగిన యంశముల నుపదేశింపఁ గోరి రాజాజ్ఞను బడసి వారా ప్రహ్లాదుని గొనిపోయి రాక్షసబాలురతోఁ జేర్చి జదివించుచుండిరి. గురుపుత్రులు తమగృహముల కేగునపుడు "ఆటలాడుటకు రమ్మ" అని తన్ను బిలుచు బాలకులను జేర్చి "మిత్రులారా! కాలము నాటల యందేల వ్యర్థపుచ్చెదరు? మన యీడు పిల్లలుగూడ మృతినొందుటఁ జూచుచున్నారు గదా! నేఁడో, రేపో మనమునునట్లు మృతినొందెదము. "ఎప్పుడో ముసలితనము వచ్చినపుడు భక్తితో నుండవచ్చును. ఇప్పటినుండి కష్టపడనేల యనియనుకొనక నేటినుండియు నాటలయందాదరము విడిచి పరమేశ్వర భక్తిని దీక్షతోఁ బూనుఁడు. అట్లు చేసినయెడల సమస్తబాధలు తొలఁగిపోవును. కాఁబట్టి రండు. హరికీర్తనలు

బాడుదము. రాక్షస సాంగత్యము వీడుదము. ముకుందుని భక్తులను గూడుదము." అని ప్రహ్లాదుఁడు హెచ్చరింప రాక్షస బాలురు తమ గురువులు కఱపు చదువులను



జాలించి నారాయణ భక్తిని నిష్కల్మష బుద్ధితో భజన జేయఁబూనిరి. అంత చండామార్కులు హిరణ్యకశిపునితో "దానవోత్తమా! నీ కొడుకు తక్కిన దనుజ బాలకులకుఁ గూడ విష్ణుభక్తిని బోధించి వారలనందఱిని మేము బోధించు నంశములను వినకుండఁ జేసినాఁడు. చాలమోసము వాటిల్లెను. మేమెన్ని విధముల మాన్పఁదలంచినను విష్ణుభక్తి నుడుగక యున్నాఁడు.

కావున వానిని జదివింప మాకు దుర్లభము. 'తాఁ జెడ్డ కోతి వనమెల్లఁ జెఱిచినది' అనునట్లు తాను జెడుట

యట్లుండ దనుజబాలకులనెల్ల ననుగూడఁ జెఱుపుచున్నాఁడు. ఇఁక నీపుత్రుని నీవు జాగ్రత్తపెట్టుకొనుము" అని చెప్పఁగనే దానవరాజట్టె మండిపడి తోఁకఁ ద్రొక్కిన త్రాఁచువలె నధిక రోషముఁ గలవాఁడై కుమారునిఁ జంపనిశ్చయించి కన్నులు జేవురింప, కటములదర, నొడలు గంపింప వానిని బిలిపించి ధిక్కరించి "ఓరి కులద్రోహీ! అష్టదిక్పాలకులు కూడ నన్నెదిరింపలేక వెఱచి మూల మూలల నక్కి యున్నారు. ఇట్టియెడ నీకేల వెఱపులేదురా ? ఓరీ దుర్మతీ! నా పేరుఁ జెప్పిన ముల్లోకములు కంపించును. అట్టి నా యాజ్ఞను నీ వేల మీరుచున్నావురా ? ఓరీ పాపీ! నాకడుపు జెఱుపఁ బుట్టితివి గదరా ? ఓరీమూర్ఖా ! నిన్నిపుడు చంపి యీ దానవకులమును నిర్దోషముగఁ జేసెదను. చూడు. ఇది నా ప్రతిన. ఇప్పుడు నీకు దిక్కెవ్వరురా ? " అని గద్దింప జనకునకుఁ దనయుఁడు "ఓతండ్రీ ! బలవంతులకును దుర్బలులకును బీదలకును సాదలకును నీకును బ్రహ్మములకును నందఱకును దిక్కెవ్వఁడో యా శ్రీహరియే నాకును దిక్కు" అన విని హిరణ్యకశిపుఁడు,

"ఓరీ ! కుమతీ ! నా కెదురాడెదవటరా ! నేనే యీ లోకములకెల్లఁ బ్రభుఁడను. నాకంటె రాజొకఁడు వేఱె లేఁడు. నాతమ్ముఁడైన హిరణ్యాక్షుని జంపినపు డా విష్ణుని బలుమాఱు వెదకి చూచితిని. వాఁడెక్కడను గాన్పింపలేదు. ఓరీ మూర్ఖాత్మా ! వాఁడెక్కడ నుండునురా ? " అనఁగాఁ

ప్రహ్లాదుఁడు తన చిత్తమున హరిని ధ్యానించుచుఁ గన్నుల నుండి యానంద బాష్పములు జలజలరాల, నొడలు పులకరింప, "ఓదనుజరాజా ! ఆ శ్రీహరి యిందుగలఁడనియు, నందు లేఁడనియు నున్నదియా ? సమస్తమందును గలఁడు. నీకుఁ జూడవలెనని యుండిన నెందు వెదకిన నందే కాన్పించును". అన విని రాక్షసరాజు "ఓరీ ! డింభకా ! హరి యంతటను గలఁడని పేలుచున్నావు. ఆ చక్రిని, గ్రక్కని నీ స్తంభమునఁ జూపఁ గలవఁటరా ? అట్లు చూపలేని యెడల నిదె యీ ఖడ్గముతో నీ కంఠమును ద్రుంచివైచెదను."

అంత మహాభక్తుఁడగు ప్రహ్లాదునిమాట సత్యముఁ జేయఁదలచి యాహరి యెల్లచోటులను నరహరి రూపమును దాల్చి యుండెను. అది యెఱింగినఁ బ్రహ్లాదుఁడు తండ్రితో "ఆ చక్రి యంతటను గలఁడని చెప్పినపు డాస్తంభమం దుండుట యేమివింత? సందియము నొంద నవసరము లేదు. నేఁడు నీకు బ్రత్యక్షముగఁ గాన్పించును." అనఁగానే హిరణ్యకశిపుఁ డతి కోపమునఁ దటాలున గద్దియ నుండి యురికి, యొఱనుండి ఖడ్గముఁ బెఱికి జళిపించుచు డగ్గఱి స్తంభమును గుత్తునియలుగ వేసెను.

అంతట మహా ప్రభావుం డయిన యా శ్రీహరి నరసింహ రూపమున స్తంభము నుండి బయలు వెడలెను. పిమ్మట హిరణ్యకశిపుండు తనకు హరిచే మృతి సంభవించునని నిశ్చయించుకొని వానితోడఁ బోరాడ నారంభించెను.

ఆ నరకేసరి వానిని లెక్క సేయక సింహ మేనుగును బట్టునటుల బట్టి తొడలయందుఁ జేర్చి మహా పరాక్రమ



శాలియగు నా హిరణ్యకశిపుని వక్షస్థలమును దన గోళ్ళచేఁ

జించి ప్రేవులను మాలికలుగఁ గంఠమునకు వైచుకొనెను. అప్పుడు దేవతలు తమ బాధలన్నియుఁ దొలఁగెనని సంతోషించి పుష్పవర్షములు గురిసిరి.

అంతట బాలకుఁడైన ప్రహ్లాదుఁ డెక్కుడు భయభక్తులతో నా నృసింహదేవుని సమీపించి ప్రణామముఁ జేసి నిలిచియుండెను. భక్తపరాధీనుఁ డగు నా నరహరి కడు వాత్సల్యముతోఁ బ్రహ్లాదునిఁ జెంతఁజేరి మస్తకముపైఁ దన హస్తము నుంచి మన్నించెను. ప్రహ్లాదుఁడు స్వామిని గడుభక్తితో స్తుతించెను. అంత నృహరి "ఓ ప్రహ్లాదా! నీభక్తికిఁ జాలసంతోషించితిని. నీకు భద్రమగుగాక! ఇటుపై నీవు రాక్షసులకు ప్రభుఁడవై చిరకాలము రాజ్యసుఖముల ననుభవింపుము. నీ వంటి యుత్తముఁడగు కుమారునిఁ బడసి నా చేతిలో మరణించినందున నీ తండ్రి పుణ్యలోకములను బొందును. నీ జనకునకుఁ నుత్తరక్రియలు ప్రీతితోఁ జేయుము" అని యానతిచ్చి మాయమయ్యెను. ప్రహ్లాదుఁడు తనతండ్రికి పరలోక క్రియలు సేసి, యనంతరమున పట్టాభిషిక్తుఁడై తన ప్రజలనుఁ గడుఁ బ్రీతితోఁ బాలించుచు సమస్తసుఖముల ననుభవించి కాలాంతమున శ్రీహరి సన్నిధిని జేరెను. దేవుని యందలి భక్తి, ముక్తిఁ గలిగించును.

అర్థములు;—సాంగత్యము = స్నేహము, ముకుందుఁడు = విష్ణువు, దనుజబాలకులు = రాక్షసబాలురు, జేవురించు = ఎఱ్ఱనగు, కటములు = కణతలు, నరహరి = మనుష్యరూపము సింహరూపము గలవాఁడు, ప్రణామము = వందనము, భద్రము = క్షేమము.

# 10. పులి - బ్రాహ్మణుఁడు - నక్క.

పూర్వ మొకప్పుడు పులియొకటి యొక బోనునందుఁ జిక్కుకొని యుండెను. అది ఆ బోనునుండి తప్పించుకొని పోవలెనని తలంచి యాబోనున కమర్చిన యినుప కమ్ములను గొఱుకుచు, నిటునటుఁ దిరుగుచుఁ దన ప్రయత్నములు వ్యర్థ మగుటచేత నది మిగుల వ్యసన పడుచుండెను.



దైవవశమున బ్రాహ్మణుఁ డొకఁ డాదారిని బోవుచుండెను. ఆపులి వానిని జూచి, "ఓవిప్రోత్తమా! నన్నీ బోనునుండి విడిపించి పుణ్యముఁ గట్టుకొమ్ము. పుణ్యాత్ములు

తమ దేహమునైన నిచ్చి పరులకు మేలుచేయఁ జూతురు గదా!" అని పలికెను. అది విని యా బ్రాహ్మణుఁడు "ఓ పులీ! నీవు చెప్పినది నిజమే. ఆర్తత్రాణరక్షణము కర్తవ్యమే. అయినను నీవు క్రూరజంతువవు. నిన్ను విడిపింపగనే నామీదబడిచంపి భక్షించెదవు. ఎవఁడైనఁ గొఱివి పెట్టి తల గోకికొనునా? కావున నిన్ను నమ్మవచ్చునా? కూడదా? అని యోచించుకొనవలసి యున్నది." అని కొంచెము మెత్తదనముదోఁప బలికెను.



ఆమాటలయందలి మెత్తదనమును గనిపెట్టి యాపులి అవ్విప్రునకు మఱింత మెత్తదనమును గల్పించి తన పనిని నెఱవేర్చుకొనుటకై "హరిహరీ! యెంతమాట పలికితివి!

అట్టిపని చేయుదునా! అట్లైనచోఁ దలఁపఁబోకుము. నిన్ను జంపనుసరికదా! నీవు చేసిన యుపకారమునకు బ్రతికినన్నాళ్లు కృతజ్ఞతఁ గలిగి దాస్యము చేయుచుందును." అనుచు లెక్క లేనన్ని యొట్టులు పెట్టుకొనెను. పులి యిట్లు పలుకుచు నిట్టూర్పు పుచ్చి దుఃఖింప సాగెను. ఆ బ్రాహ్మణుఁడు మాయ మర్మములు లేని వాఁడగుటచే ఆపులి మాటలును ఒట్టులును నిక్కమని నమ్మి బోనుతలుపుఁ దెఱచెను. పులి బోనునుండి తటాలున బైటికివచ్చి వానిని బట్టుకొనెను. "నీవెంత తెలివి తక్కువ వాఁడవు! చాల కాలము బోనులో నణఁగి యుండి యాఁకలిచే మలమల మాడుచున్న నేనిప్పుడు నిన్నుఁదినఁ బూనిన నడ్డుపెట్టువా రెవరైనఁ గలరా?" అనెను.

అది విని యా బ్రాహ్మణుఁడు తన ప్రాణమును రక్షింపుమని పలు తెఱఁగుల నాపులిని వేఁడుకొనెను. తొలుత ఫలము లేకపోయెను. కాని "నీకు మొట్టమొదటఁగాన్పించు నలువ్వురు నాచేయు పనిని గుఱించి యెట్లు తీర్మానింతురో నేనట్లు మెలఁగెదను" అని యెట్టకేలకాపులి మాటయిచ్చెను.

అది విని బ్రాహ్మణుఁడు మిగుల సంతసించెను. అంతట వారిరువురు దారిని ప్రయాణించుచుండ నెట్టయెదుట రావి చెట్టు కాన్పించెను. బ్రాహ్మణుఁడు దానితో నీవృత్తాంత మంతయుఁ జెప్పి "నీయభిప్రాయమే" మని యడుగఁగా నారావి చెట్టు "పులి జేయునది కానిపనియనియా చెప్పెదవు? అట్లనఁ

జెల్లదు. మనుష్యులకు కృతజ్ఞత కలదా? పులికి లేదని పలికెదవు! బాటసారుల కెల్లరకుఁ జల్లని నీడ నిచ్చు చెట్లను జనులు నఱికి వేయుటలేదా? కావున నవశ్యము వారిని జంపవలసినదే” అని పలికెను.

అంతట బ్రాహ్మణుఁడు ఖిన్నుఁడై పులియుఁదానును ముందునకు బోఁగా నేతము లాగుచు నెదుటఁ గాన్పించు గేదెను సమీపించి సంగతి యంతయుఁ జెప్పెను. అందులకది,

“ఓ బ్రాహ్మణుఁడా! ఎంత వెఱ్ఱివాఁడవు! పులి నీయెడఁ గృతజ్ఞత నెట్లుచూపును? నాయవస్థను జూడుము. పాలిచ్చి నన్నాళ్ళు కడుపారఁ బ్రత్తిగింజలు, తెలికపిండి మొదలగునవి పెట్టి పోషించిరి. ఇప్పుడు వట్టి పోవుటచేత నామూఁపుపైని కాడివైచి యేఁతమును లాగించుచున్నారు. వట్టి గడ్డిమాత్రము వేయుచున్నారు. శ్రీరంగనీతుల నేల చెప్పెదవు” అని వాక్రుచ్చెను.

అందులకా బ్రాహ్మణుఁడు మునుపటికంటె నెక్కుడు దిగులుపడినను చేయునదిలేక పులివెంట నడచుచు తానునడచు బాటను జూచి, తనకు సంభవించిన దంతయుఁజెప్పి నీయభిప్రాయ మేమని యడుగఁగా నాబాట “అయ్యా! నీవెంత మందబుద్ధి గలవాఁడవు! పులియెక్కడ! కృతజ్ఞతను జూపు టెక్కడ! ఈలోకములోఁ గృతజ్ఞత యను మాటయేలేదు. ఇటు చూడుము. నావలన మేలు పొందని వారు లేరుగదా!

నిర్ధనులు, ధనులు, పిన్నలు, పెద్దలు మొదలగువారందఱు నాకే మియు నీయకుండఁగనే నన్ను ద్రొక్కుచు నడిచి పోయెదరు. ఇంతటి యుపకారము నొందియు విశ్వాసముఁ జూపుటకు మాఱుగ నూక, పొట్టు, చెత్త మొదలగునవి నాపైఁ బోయు దురు. కాఁబట్టి నరులను మన్నింపరాదు" అని చెప్పుటయేగాక మీఁదుమిక్కిలి పులినిజూచి ఓ పులిరాజా! నీవు విచారింప వలసిన పనిలేదు ఇతనిని చంపవచ్చును'' అని నుడివెను.

పిమ్మట బ్రాహ్మణుఁడు అడుగవలసిన నాల్గుసాక్ష్యములలో మూఁడుసాక్ష్యములు విచారింపబడి తనకు వ్యతిరిక్తముగా బలపడినందునను తక్కిన సాక్ష్యముగూడ ఎట్లు తేలునో అన్న బెంగచే కడుదైన్యమునుబొంది పులివెంటప్రయాణమును సాగించుచుండ నక్కయొకటి వానివైపుఁజూచి "ఓవిప్రుఁడా! ఏల చాల దిగులుపడియున్నావు? నీకేమియాపద గలిగినది?" అన విని యాతఁడు దానితోఁ దన కథ యంతయుఁ బూసగ్రుచ్చినట్లు చెప్పి నీ యభిప్రాయ మేమని యడుగఁగా నది "మిత్రుఁడా! అబ్బా! ఇది మెంత చిక్కు వ్యవహారము! ఏమియు బోధ యగుటలేదు. ఇంకొక సారి చెప్పుము. ఒక దానిలో నొకటి కలిసి పోవుట వలన నా మనస్సు భ్రమించుచున్నది. అనఁగా నతఁడు విసుగు కసుగులేక మఱలఁ జెప్పసాగెను. కాని నక్క తల పంకించుటయేకాని తెలిసికొన్న జాడ కనబడ దయ్యెను. అంత


నక్క— "ఇదేమివింత ! ఒక చెవితో వినుచుండ వేఱొక చెవినుండి సంగతులు పోవుచున్నట్లున్నవి ! వేయేల ! ఇది జరిగిన చోటునకుఁ బోయినఁగాని నేనేమియుఁ జెప్పఁజాలను" అనెను.

పిమ్మట వారిరువురు, నక్కయుఁగలసి బోనున్న చోటున కేగిరి. అంతట సృగాలము ఆబ్రాహ్మణునితిరుగా జరిగినసంగతి వివరముగా చెప్పుమనెను. అంతట నాబ్రాహ్మణుఁడు వెనుకటి సంగతి బోధించుటకు మొదలిడెను.

నక్కవిని "ఛీ! నాదెంత మందబుద్ధి? అయ్యా! కథయెట్లు ప్రారంభమైనది? ఈమాటు శ్రద్ధగా వినెదను. ఏమేమి! ఓబ్రాహ్మణుఁడా! నీవు బోనులోఁ జిక్కుకొంటివా! మార్గవశమున పులి నీవున్న బోనుదగ్గఱకు వచ్చెనా?" అని ప్రశ్నించుచుండగాఁ బులి కల్పించుకొని "నక్కా! ఛీ, ఛీ, నీవెంత మతిలేని దానవు! బోనులోఁ జిక్కుకొని యున్న దానను నేనుగాని బ్రాహ్మణుఁడుకాఁడు. తెలిసినదా?" అని గద్దించిపలికెను.

అనఁగా విని నక్క మిగుల భయమునొందిన దానివలె నటించుచుఁ బులితో "అయ్యా! చిత్తము. బోనులోఁ జిక్కియున్నదానను నేనా! అబ్బే! నేను కాదు. చాలు చాలు. ఏమి నా తెలివితేటలు!" అనుచు మరల ఎట్లూ? బ్రాహ్మ

ణుని లోపలఁ బులిచిక్కుకొనియున్నది? అప్పుడుబోనాదారిని బోవుచు నచ్చుటకి వచ్చినది? కాదు, కాదు. నేనెంతపొర పడుచున్నాను? బాగు, బాగు! నాకీసంగతి యీజన్మలో తెలియునని తోఁపదు. ఓపులులఱేడా! నిష్కారణముగా నీకు భోజనమునకుఁ బ్రొద్దుపోవుచున్నది. కనుక వీనినిభక్షింపుము. నాకీసంగతి తెలిసి, నాతీర్మానమును జెప్పునంతకు నీకుఁ దల ప్రాణము తోఁకకు వచ్చును" అనెను. అంతఁ బులి నక్క బుద్ధిహీనతకు మిగులఁ గోపించి,



నిజమే, ఆబ్రాహ్మణుఁడు బోధించుచున్నంత నఱకు నీకీవృత్తాంతము తెలియదు. నీకుఁ దెలియునట్లు నేఁజెప్పెదను. రా, రమ్మా. ఇటుచూడుము. ఇదిగో "నేను పులిని."

చిత్తము, స్వామీ !


అతఁడు బ్రాహ్మణుఁడు.

చిత్తము, స్వామీ !

అల్లదె బోను.

చిత్తము, స్వామీ !

నేనా బోనులోఁ జిక్కు కొంటిని. ఇప్పు డేమయినఁ దెలియు చున్నదా ?



తెలిసినదిస్వామీ ! అయ్యో ! తెలియలేదుస్వామీ ! నాయందు దయయుంచి మఱియొకతూఱి.

"మంచిది" అని యోపిక లేనిదై పులి పలికెను.

"స్వామీ! మీరెట్లందుఁ జిక్కుకొంటిరి? నామీద గోపింపకుఁడు. తెలివితక్కువదానను గనుక నిన్నిసారులడుగ వలసి వచ్చినది" అన విని పులి, ఆ బ్రాహ్మణుని మొదట బోను మృగముల బట్టుటకై యెట్లు పెట్టెదరో బోనులో పెట్టు ఎర లేకపోయినను బోనును మాత్రము పెట్టుమని పెట్టించి నక్కను జూచి 'జంబుకమా! మొదట యీబోను ఇట్లు ఉండినది. నేనిట్లు పోయితిని' అని గబగబపోయి బోనులోఁ బూర్వమువలెఁ జొచ్చెను. చొచ్చుటతోడనే యథా ప్రకారము బోనుపడెను. అంతటపులి 'ఓ ఫేరవమా! ఇప్పుడైనను దెలిసినదా' అని గద్దించెను.

"ఇంత తేటగాఁ దాము చెప్పినపుడు కూడఁ దెలియకుండునా? మిగుల స్పష్టముగాఁ దెలిసినది" అని యనుచు దాను బన్న దలచిన పన్నాగము సాగి నందులకు లోలోన సంతసింపుచు పులియొక్క తెలివి లేమి తనమునకు తనకు నవ్వురాఁ బక పక నవ్వుచు ఇఁక నెవరిదారి వారిది. నాదారిని నేఁ బోయెదను అని నక్క వెడలి పోయెను.


నక్క చేసిన మేలునకు సంతసించి బ్రాహ్మణుఁడు తన దారిని బోయెను.

అర్థములు:—కృతజ్ఞత = చేసినమేలు తెలిసికొనుట, దాస్యము = నౌకరి, ఖిన్నుఁడు = విచారము గలవాఁడు, పంకించుట = ఊపుట, విప్రాధముఁడు = బ్రాహ్మణులలో నీచుఁడు, మార్గవశమున = త్రోవను బోవుచు.

---

# 11. తపాల నిర్ణీతాంశములు.

పూర్వకాలమందు దూర దేశమునం దుండిన మన బంధు మిత్రాదుల సౌఖ్యాదులను దెలిసికొనఁ దలఁచియు వ్యావహారిక సంగతులను గ్రహింపఁ దలచియు నుత్తరములు పంపఁగోరని యెడలఁ బ్రత్యేకముగా నొక భృత్యునకు దారి బత్తెము కూలి నిచ్చి పంపవలసి యుండెను. ఏవైన వస్తువులను గాని ద్రవ్యమునుగాని పంపఁ గోరిన నాఁ డిదియే




శరణ్యము. వేఱు మార్గము లేదు. మార్గ మధ్యమునఁ జోరుల బారినుండి తప్పించుకొని గమ్య స్థానముఁ జేరి

యా ధనాదుల సందః జేయుట కలలోని వార్తగా నుండెడిది కదా ! ప్రస్తుత కాలమం దైననో యుత్తరములు వార్తాపత్రికలు, పుస్తకములు వర్తకుల విక్రయ వస్తువుల పట్టికలును, బుస్తకముల జాబితాలును మొదలగునవి స్వల్ప ధనవ్యయముతో నచిరకాలమున నెన్నివందల మైళ్ళదూర మైనను నిర్భయముగాఁ బంప వచ్చును. బంగారు, వెండి, నోట్లు మొదలగు విలువగల వస్తువులను భీమాచేసి పంపిన యెడల నవి ప్రమాద వశమున మనవశము దప్పి పోయినచో ప్రభుత్వమువారి తపాలా శాఖాధ్యక్షు లానష్టముఁ గట్టి యిచ్చెదరు.

కొద్దిపాటి యంశములను వ్రాయునెడ కార్డుమీఁదనే వ్రాయుదురు. దానికొకవైపున పోస్టుకార్డనియు,చిఱునామా వ్రాయవలె ననియు ముద్రించి యుండును. ఆవైపుననే సంగోరు భాగమున నొక గీటుండును. ఆ గీతకు నెడమ వైపునఁ గూడ నుత్తరమునందలి యంశములు మిగిలినచో వాని నచ్చట వ్రాయవచ్చును. చిఱునామ మట్టునకు విస్పష్టముగా వ్రాయవలెను. దానిని సామాన్యముగ నిట్లు వ్రాయుదురు.

మ. రా. శ్రీ.

ఈదర వేంకట్రావు పంతులుగారు,

ప్రొప్రయిటరు,

వేంకటరామ్ అండ్ కో.,

ఏలూరు.

తపాలా కచ్చేరియున్న యూరగు నెడల తపాలా బంట్రౌతునకుఁ దెలియు విధమునఁ జిఱునామ వ్రాయవలయును. చెన్నపట్టణము మొదలగు గొప్ప గొప్ప నగరములకు నుత్తరములు పంపునెడ నాచిఱునామాదారుఁ డున్న పేటపేరు, వీధిపేరు, కవాటసంఖ్య వ్రాసినగాని యవి చేరుట యరుదు. ఇట్లు వ్రాయవలెను.

మ. రా. శ్రీ.
సుదర్శనం కోనేటిరావుగారు,
నెం 20 రు తులసింగ పెరుమాళ్ళవీధి,
తిరువళ్లిక్కేణి, మదరాసు.

కొన్ని కుగ్రామముల యందు తపాలపెట్టె కూడ నుండదు. అట్టి యూళ్ళకు తపాలా బంట్రౌతు వారమునకు రెండు మూఁడు పర్యాయములు వచ్చుచుండును. అందుండు వాస్తవ్యులకు వ్రాయు లేఖలపై నా గ్రామ నామమే గాక యచ్చటి గ్రామ మేతపాలకచ్చేరి యధికారములోఁ జేరినదియో యా యూరిపేరుఁ గూడ వ్రాయవలెను.

మ. రా. రా. శ్రీ.
డి. యస్. రామారావుగారు,
వెలిగండ్ల,
రామగోపాలపురం పోస్టు,
నెల్లూరుజిల్లా.

యని వ్రాసిననే చిఱునామ దారునికిఁ జేరును. కార్డుమీఁద వ్రాసినయెడల 9 పైసలు వెచ్చింపవలెను. కాగితపు సంచిలో

(కవరులో) ఉత్తరము పంపవలసినచో నొకయణాకానియగును. కవరులోఁ బంపు నుత్తరము రెండు తులములన్నర యెత్తుకంటె మించరాదు. ఉత్తరములమీఁది చిరునామా సరిగా లేనప్పుడు చిఱునామా దారునికిఁ బోయి చేరక యనాథ లేఖాలయముఁ (Dead letter office) జేరును. అచ్చట దానిని విప్పి చూచి లేఖరి చిరునామ స్పష్టముగ దెలిసినయెడల వానికి మఱలఁ బంపివేయుదురు. లేనిచోఁ జింపివేయుదురు.

ఇట్టి యధికారములు వారికి మాత్రమే కలవు. ఈకచ్చేరి రాజధానియందలి ముఖ్యపట్టణములలో నుండును. మన రాజధానికి చెన్నపట్టణమునందుఁ గలదు.

ఉత్తరముల తూనికకు ననుగుణముగాఁ దపాలబిళ్ళల నంటింపక తక్కువబిళ్ళల నంటించినఁ జిఱునామదారు నొద్ద రెండురెట్లు వసూలుచేయుదురు. అదనముగా వసూలుచేయు ధనముకార్డునకొకయణన్నరకంటెను, కవరునకు రెండున్నరణాల కంటెను తగ్గియుండదు. జంటకార్డులు అణన్నరకు నిత్తురు. ఇవి మిగులఁ ద్వరలోఁ బ్రత్యుత్తరములు గావలసినప్పుడు వ్రాయుదురు. దీనినేరిప్లై కార్డందురు. బిళ్ళ యంటింపక వ్రాసిన యుత్తరమును నాట్‌పెయిడ్ ఉత్తరమందురు. ఇట్లు కవరు మాత్రమే వ్రాయనగును. దానిని చిరునామ దారుఁడు రెట్టింపు బిళ్ళల ఖరీదిచ్చి పుచ్చుకొన వచ్చును. లేనిచో నది వ్రాసినవారియొద్ద వసూలు చేయుదురు. వారు చెల్లించుదాఁక వారి యుత్తరముల నియ్యక బిగఁబట్టుదురు.

బంగారు, వెండి వస్తువులుగాని, యమూల్యములగు నవరత్న ఖచితములగు నాభరణములుగాని పోస్టుమూలమున భీమాచేసి పంపవచ్చును. అట్టివానిని డబ్బాలో నుంచి భద్రముగా మూఁతవైచి బిగించి మంచి గుడ్డసంచిలో నుంచి గట్టిగాఁ గుట్టించి లక్క ముద్రలు వేసి పంప వచ్చును. అందున్న వస్తువుల విలువ యిన్ని రూపాయలని చిరునామ పై భాగమున నక్షరములతో వ్రాయవలెను. ఇట్టి బంగీలమీఁదను రిజష్టరుజేయించిన యుత్తరములమీఁదను, నెడమ వైపు నడుగుభాగమునందు వానిని బంపెడువారి విలాసమును తేటగా నిల్లు వ్రాయవలెను.

రూ ౧, ౦౦౧ లకు భీమా చేయడమైనది.

| బిళ్ళలు. |
|---|

మ. రా. శ్రీ ఈదర వేంకట్రావుగారికి,
ప్రొప్రయిటరు,
వేంకటరామ్ అండ్ కో,.
ఏలూరు.

గోపాలుని జానకిరామయ్య
వేంకటరామ్ అండ్ కో.,
బెజవాడ.

కఱెన్సీనోట్లు పంపవలసినచోఁ గవరులోనుంచి కట్టుదిట్టముగా గుట్టి లక్కముద్రలువేసి పంపవలయును. భీమా చేసిన బంగీ మనకందినట్టు తిరుగు రసీదు పోస్టువారే పుచ్చు

కొని పంపిన వారికిచ్చెదరు. రిజిష్టరు ఉత్తరమునకైతే రశీదు నకు మఱియొక యణా యదనముగాఁ జెల్లింపవలెను.

ఉత్తరములకు తూనికప్రకారము బిళ్ళలంటింపవలెనని యిదివఱకు వ్రాసి యుంటిమి గదా! రిజిష్టరుచేసిన యుత్తరములకును, బంగీలకును తూనికప్రకారముగ నంటింపవలసిన బిళ్ళల కరీదు తపాల చట్టములలోఁ బ్రకటింపబడి యున్నది. పోస్టుమాస్టరుగారి నడిగినయెడల బంగీల తూనికయు బిళ్ళల వెలయుఁ జెప్పెదరు. ఉత్తరములు వేయు బెట్టెయందుత్తరములనేగాని బంగీలు పార్సెలులను పడవేయరాదు. తపాల కచేరిలో వీనిని పుచ్చుకొనుట కుద్యోగస్థులను నియమించియున్నారు. వారిచేతికిచ్చి రసీదు పొందవలయును. లేదా కొన్నిచోట్ల వానికిఁ బ్రత్యేకముగఁ బెట్టెలుండును.

మరియొక యూరనున్న మన స్నేహితులు, బంధువులు మొదలగువారికిఁ గొంత సొమ్ము పంపఁ దలఁచినపుడు తొలుత నాడబ్బును తపాలాఫీసులోఁ జెల్లింపవలెను. అప్పుడు పోస్టువారు కొంతసొమ్మును 'కమీషన్' క్రింద వసూలు చేయుదురు. ఇట్లు సొమ్ము తపాల మూలమున పంపుటకుఁ బూర్వ మచ్చు ఫారముమీఁద సరియైన విలాసము వ్రాసి పంపువారి విలాసముకూడ వ్రాసి తపాలయుద్యోగి యొద్దకు పంపఁదలఁచిన మొత్తముతోఁ బాటు కమీషన్ కలిపి యిచ్చినయెడల నాతఁడు రసీదిచ్చును. విలాస దారునికి

సొమ్మందిన వెంటనే యతని సంతకముగల రసీదు సొమ్ము పంపినవారికి వచ్చును. ఇట్లు ద్రవ్యము పంపెడు పద్ధతిని మనియార్డరు పద్ధతి యని యందురు. ఎంతెంత సొమ్మున కెంతెంత కమీషు నియ్యవలెనో తపాల పత్రికటనలలో ప్రచురింపఁబడి యున్నది.

పదిమైళ్ళ దూరమున నుండు గ్రామముల కెంత కర్చగునో కాశీనుండి రామేశ్వరము వఱకును నంతియే కర్చగును. దూరమునఁబట్టి కర్చుండ నేరదు. యాత్రార్థము కాశికి వెళ్ళిన మన స్నేహితునికి డబ్బుత్యవసర మగునపుడు మన కాసంగతి నాతఁడు తంతివార్త మూలమునఁ దెలియఁ జేసిన యెడల మనము 'తంతి మనియార్డరు' పంపవచ్చును. నాలుగు దినములలో నందెడు సొమ్ము తంతి మూలమున నాలుగు గంటలలో నందఁగలదు. సామాన్యమైన మనియార్డరును పంపు విధముననే దీనిని బంపుదురు.

బొంబాయినుండి మనకేదైన యౌషధమో, మంచి చిత్రపటమో గ్రామఫోను పెట్టెయో కావలసి వ్రాసినచో మన నివాసస్థానములకే యావస్తువు తపాలమూలమున వచ్చి చేరును. దాని కరీదును పోస్టువారు మన వలన వసూలు చేయుదురు. దానికి "వ్యాల్యూ పేయబుల్ పోస్టు" అందురు.

తపాల వలన ప్రభుత్వము వారిట్టి ముఖ్యమగు సదుపాయములను మనకు గలుగఁ జేసినందులకు మన మెంతయు ప్రభుత్వమువారికిఁ గృతజ్ఞులమైయుండు టొప్పును.

అర్థములు:— గమ్యస్థానము=పోవఁదగినతావు, అచిరకాలము = త్వరగా, ప్రమాదవశము=పొరపాటు, సంగోరు = సగము, అనుగుణము = తగినవిధము, అమూల్యములు = మిగుల వెలగలవి, నవరత్న ఖచితములు=తొమ్మిది విధములగు రత్నములు చెక్కినవి, అదనము = ఎక్కువ, సదుపాయము = మంచివీలు.

# 12. నలమహారాజు జూదము.

దమయంతి నలుని వరించి వివాహ మాడిన తరువాత నింద్రుఁడు, యముఁడు, వరుణుఁడు, కుబేరుఁడును నా నల దమయంతుల దాంపత్యమునకుఁ గడు మెచ్చి వరము లిచ్చి తమ తమ లోకములకుఁ బోవుచుఁ దమ కెదురుగా వచ్చు కలినిఁ గాంచి "ఓ కలీ! ఇదేమి? ఇంత తొందరగా నెచటికిఁ బోవుచున్నావు?" అని యింద్రుఁ డడిగెను. కలి "ఓ సురేంద్రా! భూలోకమున దమయంతీ స్వయంవరము జరుగుచున్నదఁట. ఆమె తప్పక నన్ను వరించునను నాశతోఁ బోవుచున్నాను" అని పలికెను.


ఆ మాటలు దిక్పాలురు నలుగురును విని పక్కున నగి "పండుగ గడచిన పాచి" యనినటుల అన్నియు జరిగిన

తరువాత వెళ్ళుచున్నావేమి ? దమయంతి నలుని వరించినది. వివాహమైనది. ఇంక పోనేల ? వెనుకకు మఱలుము" అనిన విని కలి మిగుల నలిగి "ఏమీ! అప్పుడే స్వయంవరమైనదా! ఆలాగైనచో వినుఁడు. ఆదంపతులను రాజ్యభ్రష్టులను జేసి వారి కిరువురకు నెడఁబాటుఁ గల్పించెదను. లేనిచో నన్ను మాఱుపేరునఁ బిలువుఁడు" అని ప్రతిజ్ఞఁ జేసెను.

నలమహారాజునకుఁ బుష్కరుఁడను నొక జ్ఞాతి కలఁడు. జ్ఞాతులకు సహజముగ విరోధముండునుగదా! ఒక్కనాఁడు కలి పుష్కరునొద్దకుఁబోయి "నీవు నలునితో జూదమాడుము. నేను నలునియందుఁ బ్రవేశించి వాని కపజయము కలిగించెదను. వాని రాజ్యమంతయు నీవు హరింపుము" అని పుష్కరుని బురిగొల్పెను.

అంత నొక్కనాఁడు కలి బ్రాహ్మణ వేషమును ధరించి పుష్కరునితోఁ గలిసి నలునొద్దకుఁ బోయి "ఓ నలమహారాజా! మా పుష్కరునితో జూదమాడుము" అని హెచ్చరించెను. ఇట్లు కలిచేఁ బ్రేరేపింపఁబడి నలుఁడు తన జ్ఞాతితో జూదమాడ నారంభించి తనకున్న యెల్లధనమును వివిధములగు వస్తువులను బందెమిడి యోడిపోవుచుండెను. అది తెలిసి పౌరులు మంత్రులు పురోహితులు దమయంతిని ముందిడుకొని జూదమునుండి నలుని వారింప నేగిరి. కాని నలుఁడు వారెంత చెప్పినను వినఁడయ్యెను. కలి విననీయఁ

డయ్యెను. జూద మాడుట నుడుగడయ్యెను. అంతలోఁ దమయంతి "అయ్యో నేనేమి చేయుదును? జూదమందోడిన కొలఁదిని అభిలాషయుఁ బట్టుదలయు నెక్కుడగుచుండును"



అని చింతించి యికఁ దనపతి కపజయము గలుగునని నిశ్చయించి పతి యనుమతి వడసి సుతాసుతుల విదర్భా పట్టణమునఁ దన పుట్టింటికిఁ బంపివేసెను.

నలుని రాజ్యము పుష్కరుని యధీన మయ్యెను. వెంటనే యాతఁడు నలదమయంతులను బురమునుండి వెడలఁ గొట్టెను. పట్టణము వెలుపల మూఁడు రాత్రులు మూఁడు పగళ్లు తినఁదిండియు త్రాగనీరును లేకయుండిరి. పుష్కరుని యాజ్ఞచే నొక్క పౌరుఁడైన నలునికడ కరుగ వెఱచెను.

తొల్లి యెల్లరచే సత్కారముగాంచు నలుఁడు కాలవశమున నిప్పు డెల్లవారిచేతను దిరస్కారముఁ గాంచువాఁడయ్యెను. భార్యాభర్త లిరువురు నాఁకలిబాధకుఁ దాళలేక యుండిరి. అంతట బంగారు రెక్కలు గల కొన్ని పక్షులు వారి యెట్ట యెదుట దిరుగుచుండ నలుండు గాంచి యవి యాహారమగు నని తన బట్టను వానిపై వైచి బట్టబోవ నా మాయపక్షు లా పుట్టముతోడనే యాకసమున కెగసెను. పక్షులు దొరకక పోవుట యటుండఁ దన పుట్టమును గూడఁ గోలుపోయెను. ఇట్టి కష్టదశ తమకు సంభవించి నందులకు మిగుల వగఁజెంది యచ్చటనుండి యొక యరణ్య మార్గమున బయలు వెడలిరి.

అప్పుడు నలుఁడు తన భార్యను చూచి "ఓ యబలా! నీవీ యడవుల నా తోడ నిడుమలు పడఁజాలవు. పుట్టినింటి కేగి యచ్చట సుఖ ముండుము" అనుటయు దమయంతి కరము విచారించి, "ప్రాణేశ్వరా! మీరును నేనును గలిసి విదర్భకుఁ బోయి సుఖలీల నుందుదము. ఘోరాటవులకుఁ బోనేల? నలుకష్టములకు వశముగానేల" అన విని నలుఁడు "అట్లుకాదు పూర్వము మహావైభవము ననుభవించుచు బంధుజనుల యొద్దకుఁ బోయి వారి కెంతయో ముదమును గూర్చువాఁడను. ఇప్పుడు కట్టబట్టయుఁ గుడువఁగూడును లేక చుట్టముల దగ్గఱ కేముఖము పెట్టుకొని పోయెదను? నా రాక వారికేమి సుఖకర మగును? కావున నేరానొల్ల. నీవు పొమ్ము. నా మాట సమ్మతింపుము" అని పలికెను.

దమయంతి, "నాథా! మీరడవుల నిడుములు గుడుచుచుండ నేను నాపుట్టింట సుఖింపనేర్తునా? కష్టదశయందే గద భార్య భర్తకుఁ దోడ్పడవలయును. మనోవ్యాధికి యోగ్యురాలగు భార్యయే తగినమందు. అడుగడుగునను హెచ్చరించుచు, నాఁకలి యగునపుడును, శ్రమ జెందినపుడును గనుఁగొని సమస్తములగు నుపచారములను జేసి భార్య పురుషుని దుఃఖములను దొలఁగించును. కావున నన్ను వీడక మీతోడ గొనిపొండు" అని వేఁడు కొనెను. అందులకు నలుఁడు సమ్మతించెను.

అర్థములు:—వరించుట=పెండ్లియాడుటకు నిశ్చయించుట, రాజ్యభ్రష్టులు=రాజ్యమునుండి దొలఁగినవారు, ప్రతిజ్ఞ = పందెము, అభిలాష=కోరిక, సుతాసుతులు = కూతుండ్రు కొడుకులు, ఎట్టయెదుట= మిక్కిలిముందు, పుట్టము = వస్త్రము, మనోవ్యాధి=వ్యాకులము, ఇడుములు = శ్రమలు.

---

# 13. నలదమయంతుల వియోగము.

ఇట్లుమాటలాడుకొనుచు నాదంపతులుజనశూన్యమగు నడవింబడి పోవుచుండ నొక్క యెడ ధూళి గప్పియున్న పావడిని గాంచిరి. మార్గాయాసముచే గడు బడలియుండిరి. కావున నచ్చట విశ్రమింప నిశ్చయించిరి. దమయంతి కొంతవడి భర్తపాదసేవచేసి యొడలెఱుంగక వాని యడుగుల పొంతను బరుండి నిదురించెను. భార్య కష్ట దశకు మిగుల

వగనొందు నానలునకుఁ గూర్కు రాదయ్యె. అప్పుడొంటరిగ



గూర్చుండి తన సతి దైన్యమునకు శోకించి "ఆహా! ఎంత కష్టము! మెత్తని పాన్పుపై బరుండు నీకోమలాంగి యిట్టి

కటికినేలఁ బరుండవలసెఁగదా! నాకు భార్యయగుటచే నిట్టి కష్టము వాటిల్లెను. ఈమె దుఃఖమును నేను జూడఁజాలను. ఎటకైన జనియెద. నన్నుఁగానక యెట్లైన తన బంధుజనము కడకేగి సుఖమంద గలదు.'' అని తలంచి మేలుకొనక మునుపే యామె చీరయందు సగము చించుకొని నలుఁడు ప్రయాణమయ్యెను. కాని నిద్రించు సాధ్వి నొక్కతెను నట్టడవిలో విడిచి పోవుటకు మనసొప్పక కొంత దూరముఁ బోవుచు మఱలి వచ్చుచు కొంతవడి తెంపు సేయలేక యెట్టకేలకు నలుఁడామె నేకాకినిఁజేసి వెడలి పోయెను.

అంతఁ గొంతసేపటికి దమయంతి మేల్కొనితనపతినిఁ గానక భయశోకములు ముప్పిరిఁగొన నలుదెసలుఁ గలయఁ జూచి ''నాథా! నన్నువీడనని పలికితిరికదా! ఆపలుకులిప్పుడు మఱచుట న్యాయమా! నేనెచటికిఁ బోదును. ఈ నట్టడవిని నిన్నెట్లుగాంతును. నీవంటి చక్రవర్తి యిట్లు బొంకదగునా! నాలుగు వేదముల నధ్యయనము చేయుట వలనఁ గలుగు ఫలముకంటె నొక్క సత్యవాక్యము వలన ఫలమెక్కుడని వినవే'' అనుచుఁ బతియందే బుద్ధి నిల్పి యా కాననమునఁ ద్రిమ్మరుచుండెను.

దమయంతి మహాపతివ్రత యగుటచేతఁ దన యవస్థకు విచారింపక భర్త యేకాకియై తోడులేక తిరుగుచు నాఁకలి దప్పికలచేత నెట్టి శ్రమకు లోనై యుండునో యని మిగుల

వగచుచు నడవియందాతని వెదకుచుండెను. అట్టియెడ నొక కొండచిలువ దాపున నామె యేమఱు పాటుననడుగు వెట్టెను. అది యాఁకలిగొని యుండుటచేత నామెను మ్రింగఁ జొచ్చెను. అప్పుడామె తన భర్తను దలంచి, వేగ వచ్చి రక్షింపుమని మొఱవెట్టెను. ఒక్క యెఱుకవాఁడా ధ్వనివిని వచ్చి తన ఖడ్గముచే నాపాము తలను దుత్తునియలుగ ఖండించెను. ఆమెను సమీపతటాకమునకుఁ గొని పోయి స్నానముచేయించి తీయనిఫలము లామెకాహారముగఁ దెచ్చి యిచ్చెను.

అంతనామె యచటనుండి కదలి దనభర్తనే స్మరించుచుఁ బోవుచుండ నామె పుణ్యవశమునఁ ఋష్యాశ్రమ మొకటి కాన్పించెను. దమయంతి యచటికిఁబోయి మునులఁగాంచి నమస్కరించి "మునులారా! నేను నిషధ దేశాధీశుండగు నలచక్రవర్తి భార్యను. ఆయన విధివశమున నన్నడవియందు విడిచిపోయెను. ఆయనను వెదకుచు నిట్లు తిరుగుచున్న దానను. నా ప్రాణేశ్వరుఁడు వెళ్ళిన మార్గ మెఱుఁగుదురేని దయయుంచి సెలవిండు. కొలఁదిదినములలో నాకాయన దర్శనము కలుగని యెడలఁ బ్రాణంబులు నిలువవు" అని కంటికి మంటికి నేకధారగా నేడ్చెను.

ఆమునులు జాలినొంది దివ్యదృష్టితోఁజూచి "అమ్మా! దుఃఖింపకుము. కొలఁది దినములలో నీభర్తను గాంచఁగలవు.

మీరిరువురును నెప్పటివలె రాజ్యవైభవము నందఁగలరు” అనిచెప్పి యదృశ్యులయిరి. అప్పుడు దమయంతి యచ్చెరు వొంది యమ్మునుల మాటలనే తలఁచుకొనుచుఁ బోవుచుండ నెదుట నామెకొక్క చనుప కానవచ్చెను. ఆబిడారు చేది దేశాధిపతియైన సుబాహు పురమున కేగుచుండుట విని యద్దానిని గూడిపోయెను. రాజమాతయగు సుదేష్ణ బిడారు వెంట రాజమార్గమునఁ బోవు దమయంతి సౌందర్యమునకు మెచ్చుకొని, తన యంతఃపురమునకుఁ బిలిపించుకొని సన్మానించెను. దమయంతి తన వృత్తాంతము నా రాజమాత కెఱిఁగింపక సైరంధ్రియై యుండి యచ్చట దినములు గడపు చుండెను.

ఇది యిటులుండగా, నలుఁడు దమయంతిని నా కాఱడవిలో విడచి పోవుచుండగా, నొక్కచోటఁ గార్చిచ్చు నడుమ పా మొకటి చిక్కి పరితాపము నొందుచు నలుని గాంచి “ఓ రాజా! నాలుగు వైపులను నీ చిచ్చు నన్నలము చున్నది. ఇందుండి నన్ను గాపాడు విధ మాలోచింపుము. నీకుఁ బ్రత్యుపకారముఁ గావించెదను” అని దీనముగఁ బ్రార్థించెను. దయామయుఁడగు నలమహారాజు కరుణించి తీవ్రములగు నా యగ్నిజ్వాలల మధ్యను జొచ్చి దానిని బైటకుఁ గొనివచ్చెను. కర్కోటకుఁడను నా పాము తన్నొక తటాకమున జేర్పుమని కోర నలుఁ డటుల నొనర్చెను.

వెంటనే యా పాము నలునిఁ గఱచెను. దాని విషముచే నలుని చక్కని రూపము మాఱిపోయెను. చేతులు పొట్టి వయ్యెను. గూనివచ్చెను. అంతఁ గర్కోటకుఁడు నలునితో, "అయ్యా! నీకిట్టి వికృతరూపము కలిగినందులకుఁ గుందకుము. నీ శరీరమందు నా విష మున్నంతకాలము నీకు శత్రుభయము మొదలగునవి కలుగనేరవు. యుద్ధమందు జయము గలుగును. కొలఁది కాలములో భార్యను గూడి రాజ్య వైభవమును బొందఁగలవు. నిజరూపమును బొందవలెనని తోచినపుడు నన్ను స్మరింపుము. అయోధ్యను రాజగు ఋతుపర్ణునిఁ జేరి వాని యొద్ద వంటల వాఁడవుగా నుండుము" అని చెప్పి వెడలిపోయెను.

అంతట నలమహారాజు వికృతరూపముతో ఋతుపర్ణుని దర్శించి "రాజోత్తమా! నేను బాహుకుఁ డనువాఁడను. అశ్వవిద్యయందుఁ గడు నేర్పరిని. రుచికరముగ వంటలఁ జేయనేర్తును. తమ్ము సేవింపఁగోరి వచ్చితిని. నన్ను దమ సేవకునిగా ననుగ్రహింపుడు" అని వేఁడుకొనెను. ఋతుపర్ణుఁ డందులకు సమ్మతించెను.

నాఁటి నుండియు నలుఁడు వంటల వాఁడై మాఱు వేషమున నా ఋతుపర్ణుని కొలువున నుండెను. ఒకనాడడవిని విడిన తన సతిని గూర్చి యేకాంతమున నిట్లు చింతించెను. "ఓసఖీ! ఇసుమంతయైన దయలేక యానాఁడు నిన్నడవిపాలు

గావించితిని. అయ్యో! ఏక్రూరమృగముచేనైన కబళింపఁబడితివా? లేక భగవంతుని కరుణచే నీ తలిదండ్రులయొద్ద సుఖముననుంటివా? హా! నాకుఁబడతివై యెన్నియిడుమలకుఁ బాల్పడితివి" అని దమయంతి దీనదశను వగచుచు ఋతుపర్ణుని కొలువున నలుఁడు వాసరములు గడుపుచుండెను.

అర్థములు:— ప్రయాణాయాసము=మార్గపు బడలిక, నట్టడవి = అడవిమధ్యభాగము, సాధ్వి = పతివ్రత, అధ్యయనము = చదువుట, ఏకాకి = ఒంటరికాఁడు, సమీప తటాకము = చేరువలోనున్న చెఱువు, చనువ = వర్తకులగుంపు, సైరంధ్రి = పతివ్రతాత్వము కాపాడుకొనుదాసి, విధివశము = దైవవశము, వికృతరూపము = వికారమగు నాకారము.

---

## 14. నలదమయంతులకై యన్వేషణము.

విదర్భాధీశుఁడగు భీమరాజు తన యల్లుఁడును కూఁతురును రాజ్యభ్రష్టులగుట విని కడు మూర్ఛిల్లి వారెట కేగిరో యెచ్చటనుండిరో యనుచు వారలను వెదకుటకై యుత్తములైన ద్విజులను రావించి బహూకరించి "ఓ విప్రులారా! నల దమయంతులను వెదకి కొనివచ్చిన వారికి అగ్రహారముల నిచ్చెదను." అని పలికి వారినినలుదిశలకుఁ బంపెను. అందు సుదేవుఁడను బ్రాహ్మణుఁడు సుబాహుపురము ప్రవేశించి రాజగృహంబులోనికిఁ బోయెను.

అంతఃపురమునఁ గడుమాసిన చీరఁగట్టి భర్తతోడి వియోగమువలన గలిగిన దుఃఖముచే మిగుల కృశించియుఁ దన పాతివ్రత్యముచే మెఱయుచున్న దమయంతిని చూచి యావిప్రుఁడానవాలు పట్టెను. "ఆహా! స్త్రీలకుఁ బతివ్రతాత్వముకంటె వేఱె భూషణము కలదా! అది దొంగలపాలు కాక విశేషమగు తేజము నిచ్చు వెల లేని నగయై ప్రకాశించును" అని పతిభక్తియొక్క ప్రభావము నెన్నుచు దమయంతిం జేరి "అమ్మా! దమయంతీదేవీ! నేను సుదేవుఁడను బ్రాహ్మణుఁడను. విదర్భాపురమున నీబంధుజనుల కెల్లఁ కుశలము. మీదంపతులను రోయుటకై మీతండ్రి పెక్కండ్రు విప్రులను పెక్కుజోటులకుఁ బంపెను. నాపుణ్య వశమున నిన్నిచటఁ గంటిని." అనగాఁ దమయంతి వాని నెఱింగి తనవారి కుశలము వేర్వేఱ నడిగి కడు దుఃఖమునఁ గోలుగోలున విలపింపఁ జొచ్చెను.

రాజమాత దమయంతి కడకు వచ్చి యామెతో మాటలాడుచున్న బ్రాహ్మణునిఁ గాంచి "అయ్యా! ఈమె యెవ్వని కూఁతురు? ఎవని భార్య? ఏల యిట్లు వియోగ దుఃఖము ననుభవించుచున్నది? ఏల యిట్లు పుణ్య వ్రతములు చేయుచున్నది?" అని యడుగ, నావిప్రుఁడు "ఈమె విదర్భాధిపుఁడగు భీమరాజు కూఁతురు. నలుని పట్టపుదేవి. విధివశమున భర్త రాజ్యభ్రష్టుఁడై యడవుల కేఁగ నాతని

దర్శించు భాగ్యమున కిట్లు పుణ్యవ్రతము లాచరించుచు నీయొడకుఁ జేరినది. ఈమె కనుబొమల నడుమ పద్మములవలె రాజిల్లు పుట్టుమచ్చ నుపలక్షించి నా భాగ్య వశమున దమయంతిఁగా నెఱింగితి" ననెను. అంత రాజమాత ధూళిచేఁ గప్పఁబడియున్న యా పుట్టుమచ్చను జలములచేఁ గడిగింప నది విస్పష్టముగఁ గాన్పించెను. అది చూచి యచ్చటివారు విస్మయచిత్తులైరి. పిమ్మట సుదేవుఁడు తమ జేని కీవార్తను దెలుప విదర్భకు వెడలెను.

ఆమె దమయంతి యని వినఁగనే రాజమాత యా దమయంతిని గౌఁగిలించుకొని "అమ్మా! నీ తల్లియు నేనును అక్కచెల్లెండ్రము. కావున నీవు నా కూఁతురవు" అన దమయంతి యామెకు మ్రొక్కి మఱికొన్ని దినము లచటనే యుండి యామెయొద్ద సెలవుఁగైకొని 'బంధు జనుల జూడ విదర్భకుఁ బోయెద' నన చేది దేశపురాజు బంగారు పల్లకి యందామె నునిచి పంపెను.

దమయంతి తలిదండ్రుల యొద్దనుండియు నెల్లసౌఖ్యము లను వీడి భర్తను గాంచు పుణ్యదినముల నెన్ను కొనుచు వ్రతములు సలుపు చుండెను. భీమరాజు తన కుమార్తె దుఃఖము నపనయింపఁ గోరి నలుని వెదుక విప్రవరుల నియోగింపఁగా దమయంతి వారలఁ గాంచి "ఓ పుణ్యాత్ము లారా! నా పలుకులు వినుఁడు. నల మహారాజిప్పు డన్యా

తెలియఁగ కుండునట్లు గూఢవృత్తి నుండును. కావున రాజ సభలకుబోయి 'సత్యవ్రతుఁడగువాఁడు పతివ్రతయు, సంతానవతియునగు భార్యను విడుట న్యాయమా ? ఇట్టి నిర్దయబుద్ధి వానికిఁ దగునా ?' అని ప్రశ్నింపుఁడు. దీనికెవ్వరోడిమాఱు పలుకునో వానిని నలునిఁగా నెఱుంగుఁడు. నాసంగతియంతయు వాని కెఱింగించి తోడ్కొనిరండు. రానిచో దెలిసికొనివైన రండు" అని పంపించిన బ్రాహ్మణులెల్ల రాజసభలకుఁబోయి దమయంతి నుడివిన వడువున బల్కిరి.

వారిలోఁ బర్ణాదుఁడను విప్రుఁడు ఋతుపర్ణునిసభఁజేరి దమయంతి తెల్పినట్లు పలుకఁగాఁ గురూపి యగు నలఁడొక్కఁడు వాని నేకాంత స్థలమునకు గొనిపోయి నిట్టూర్పు పుచ్చి "ఓవిప్రోత్తమా ! పురుషుని యెడల దోషమున్నను దానిని భరించునదియే భార్య. అట్టి సతికి నిహముఁ బరముఁ గలవు.'' అని పలికి తన యునికిపట్టునకుఁ బోయెను. పిమ్మట నాపర్ణాదుఁడు విదర్భను జేరి నడచిన క్రమ మంతయు దమయంతి కెఱింగించెను. అటుపై దమయంతి "ఆకురూపమున నున్నవాఁడు నలుఁడే కావచ్చును. లేనియెడఁ బ్రతివచనమేలఁ బలుకును? అతఁడే నలుఁడు. సందియ పడఁ బనిలేదు'' అని నిశ్చయించి తల్లిదండ్రుల యనుమతి వడసి సుదేవుని రప్పించి వానితో 'నన్ను దోడ్కొనివచ్చి నటులు నలుని గూడఁ గనుగొనిరమ్ము. పిమ్మట ఋతుపర్ణుని దర్శించి

నలు నెంత వెదకించినను కానరానందున భీమరాజు దమయంతికిఁ ద్వితీయస్వయంవరముఁ జాటించెను. ఆ స్వయంవర మెల్లి జరిగెడు. తాము తప్పక దయచేయవలెను.' అని ఋతుపర్ణునితోఁ జెప్పిరమ్మనెను. అతఁడటులఁ గావించెను.

అర్థములు:—దురపిల్లి=విచారపడి, వియోగము = ఎడబాటు, రోయుట= వెదకుట, ఉపలక్షించి = గురుతించి, విస్మయము = ఆశ్చర్యము, గూఢవృత్తి = రహస్యముగునునికి, ఏకాంతస్థలము = ఒంటరితావు, ఎల్లి = రేపటిదినము, ప్రతివచనము = బదులుమాట.

## 15. దమయంతీ ద్వితీయ స్వయంవరము.

ఋతుపర్ణుఁడు బాహుకునిఁ బిలిచి నేను దమయంతి ద్వితీయ స్వయంవరముఁ జూడ విదర్భకుఁబోవలెను. నీయశ్వనైపుణ్యమును జూపి నన్ను రేపచట నుండునట్లు చేయుము. అనిన నలుఁడు దమయంతికి ద్వితీయ స్వయంవరము నిజమని యెంచి యించుక దుఃఖించి పతివ్రతయుఁ గడు ననురాగవతియు సంతానవతియు నగు దమయంతి యొండొకని వివాహమాడునా? ఇది నమ్మఁదగినది కాదు. అయినను ఋతుపర్ణునితోఁ బోయెదనుగాక అని నిశ్చయించి గుఱ్ఱములను బూన్చి రథము నాయితముఁ జేసి తెచ్చెను.

ఋతుపర్ణుఁడు రథమెక్కెను. మహారాజు మిగుల విస్మయ మందునటుల నలుఁడు రథమును నడపి సాయం

కాలమునకు విదర్భాపట్టణమును జేర్చెను. భీమరాజు ఋతుపర్ణునిఁ బూజించి యొకసుందర మందిరమున వానిని విడియించెను. ఋతుపర్ణుఁడును "దమయంతిస్వయంవరముఁ




జూడ నిందెవ్వరు రాజులు వచ్చినజాడలేదు. దమయంతి వేఱొకని వివాహమాడునంతటి యధర్మచరితయా? ఆహా! మోసపోతిని" అని సిగ్గునొంది యుండెను. బాహుకుఁడు

రథాశ్వముల నొకచోట బంధించి రథమునకు దగ్గఱగ విశ్రమించెను.

ఋతుపర్ణుని సారథి బాహుకుఁడనియు అతఁడే పుణ్యాత్ముఁడగు నలుఁడనియు దమయంతి నిశ్చయించి కేశిని యను దాసిని పిలిచి "నీవుపోయి యీ బాహుకుఁ డెవ్వఁడో తెలిసికొని రమ్ము" అని పంపెను. అది యీ బాహుకుని సమీపించి కొంతసేపు వానితో సంభాషించి "ఓయయ్యా! మాదమయంతీదేవి భర్త దయలేక యడవి యందు విడిచిననాఁటనుండియుఁ గట్టిన మలినమగు నర్థవస్త్రము తోడను, ధూళి గప్పి యున్న శరీరము తోడను, జడలు గట్టియున్న తలవెండ్రుకల తోడను నేలమేశయ్యగాఁబరుండుచు పతినిఁ జూచు శుభ దినముల కెదురు చూచు చున్నది." అని చెప్పఁగా బాహుకుఁడు కన్నుల వెంబడిని గారు కన్నీరు కేశినికిఁ గనఁబడ కుండ వేఱొక దిక్కు మొగమును ద్రిప్పు కొనెను. కేశిని యచటినుండి మఱలి వచ్చి దమయంతి కాసంగతి నెఱుకపఱచెను.

దమయంతి యీ బాహుకుని పాలికిఁగొడుకునుబంపగా వాతఁడు వాని నెత్తుకొని ముద్దాడి, కేశినితో "ఈ పిల్లవాఁడు నాకుమారునిఁ బోలియున్నాఁడు. అందుచే వాని నెత్తుకొన్న వెంటనే నామేను పులకరించి కనులనుండి బాష్పములు గ్రమ్మినవి. ఇంక నిటు రాకుము. పరదేశ వాసులమగు

మాతో నీకేమి పనిగలదు'' అని యామెను బంపివేసెను. దమయంతి దాసి వలన నా వార్తను విని నలుండని నిశ్చయించి తండ్రి యనుమతిని వానిని దన మందిరమునకుఁ దప్పించెను. నలుఁడు కడు దైన్యమును బొంది చిక్కియున్న దమయంతినిఁజూచి మిగుల దుఃఖించెను. దమయంతి వాని వికారరూపములఁ జూచి యితరుఁడని యనుకొనక లజ్జయు, భయమునుఁదోఁప వానితోడ "విజనమైన యడవి యందున మైమఱచి నిద్రించు నబలను వీడిపోయిన నిర్దయు లెందైన గలరా! నా స్వయంవరము నాఁడు దేవతల నొల్లక తన్నే వరించితిని. కాని యింతకట్టడితనమునకు నేనేమికీడుఁ గావించితిని? 'నిన్ను వీడను. భయము నొందకుము' అనిన మాట మఱువనగునా?'' అని కన్నీరు మున్నీరుగ నేడ్చు దమయంతిని జూచి కొంతవడి దురపిల్లి "అదియంతయుఁ గలిప్రేరణమున జరిగెను. అది యటుండ నిమ్ము. నీయం దమితానురాగముఁ గల నన్ను వీడి పరునిఁ బెండ్లియాడఁ గడంగుట కుల స్త్రీకి ధర్మమగునా? రాజులెల్లరు వచ్చుటచేతఁగదా ఋతుపర్ణుఁడీ స్వయంవరమునకు వచ్చియున్నాఁడు?" అనిన దమయంతి మిగుల వెఱచి దోసిలియొగ్గి "ఋతుపర్ణుఁడు దప్ప నితరరాజులెవ్వరైన నిందువచ్చిరా? నీవు ఋతుపర్ణుని యొద్ద నుండుట పర్ణాదుఁడను బ్రాహ్మణుని వలన విని నిన్నిచ్చటికి రావింప నీయుపాయమును బన్నితిని. అంతియకాని నాకట్టి పాపపుఁ దలఁపులేదు. నీయడుగులనంటి ప్రమాణ మొనర్చెదను.

నాకట్టి చెడుతలంపే యున్న యెడలఁ గర్మసాక్షు లగు నీసూర్యుఁడు, చంద్రుఁడు, వాయుదేవుఁడు మొదలగువారు సాక్షులై పాపము ననుభవింపఁ జేయరా?" అనెను. అంత వాయుదేవుఁడు "ఓరాజా! సూర్యచంద్రులును, అగ్నియును, నేనును మూఁడేండ్లనుండి యీయమను బరీక్షించుచుంటిమి. ఈమెయందు దోసమావంతయు లేదు. నీయందు కృత్రిమము లేని ప్రేమఁగలది. ఈమెను బరిగ్రహింపుము" అని పలికెను. ఇది విని యెల్లరు నాశ్చర్యము నొందిరి. అప్పుడు నలుఁ డానందభరితుఁడై కర్కోటకుని దలంచెను. వెంటనే వాని పుట్టము వచ్చెను. దాని ధరించి నలుఁడు నిజరూపమును బొందెను. అంత దమయంతియు నాథునింజూచి కడు ముద మొందెను. దమయంతి తల్లిదండ్రు లల్లునిఁ గూఁతురునుఁ గాంచి పరమానందభరితులైరి.

ఋతుపర్ణుఁడు నలునియొద్దకువచ్చి "ఓరాజోత్తమా! నీవు నిఖిలలోకపూజ్యుఁడవు. తెలియక నిన్ను నీచపుబనుల యందు నియోగించితిని. నన్ను క్షమింపుము" అనఁగా నలుఁడు వానిని మిగుల సత్కరించెను. అంత ఋతుపర్ణుం డయోధ్యకుఁ జనెను.

పిమ్మట నలమహారాజొక్కనెల విదర్భయం దుండి కొంతసేనను గూర్చుకొని పుష్కరునితో యుద్ధముఁ గావించి యందు వానినోడించి యఖిలరాజ్యమును గైకొని భార్యయుం

బుత్రుఁడు దాను నెల్లవైభవముల ననుభవించుచుఁ బ్రజా పాలనము చేయుచుండెను.

అర్థములు:—అనురాగవతి = ప్రేమగలది, అయితము = సిద్ధము, అపర్త్ర చరిత = చెడువర్తనగలది, అగ్రసనము = సగముగుడ్డ, విజనము = జనులు లేనితావు, మున్నరు = సముద్రము, కృత్రిమము = మోసము, పరిగ్రహింపుము = భార్యగాఁ జేసికొమ్ము.

# 16. బకాసురవధ.

లాక్షాగృహదహనమైన పిమ్మట పాండవులు తమ తల్లిని వెంటఁబెట్టుకొని వారణావత పురమునువీడి యేకచక్ర పురమను నగ్రహారమునుఁ జేరిరి. అందు బ్రాహ్మణవేషములను బూని వేదము చదువుచు బ్రహ్మచారి వృత్తిని నొక విప్ర గృహమునుండి భిక్షార్థ మింటింట కరుగుచుఁ బ్రొద్దుపుచ్చు చుండిరి. అయ్యైవురు భిక్షార్జితాన్నముల వినయము మీఱ ననుదినమును దల్లికొసఁగ నామె యాయన్నమును రెండు భాగములుగఁజేసి యందు నొకభాగము భీమునకొసఁగి మిగిలినదానిని గడమ కొడుకులును దానును భుజించుచు గాలముఁ గడుపుచుండిరి.

ఇట్లుండ ఒకనాఁడు భీముఁడుతప్ప తక్కిన నలువురును భిక్షార్థమరిగిరి. భీముఁడును గుంతియు నింటనుండుతఱి నవ్విప్ర

గృహమున నుండి పరిబలమగు నార్తధ్వని వీతెంచెను. ఆయేడ్పును విని కుంతి యెంతయు వగఁజెంది భీమునిఁ జేరి "అన్నా ! మనకిల్లిచ్చి కడు నుపకృతిం గావించిన యీ భూసురోత్తముఁడు దుస్తరమగు నాపదనొందనోపు. ఈతనికి ప్రియమొనర్చుటయే మనకు కర్తవ్యము. చేసిన మేలు మఱవకుండు టెంతయుఁ బుణ్యముగదా ! ఉపకారమునకు సరియగు నుపకృతిఁ గావించుట మధ్యమము. దానిని మించిచేయుట యుత్తమము" అని పాండు సతి కన్నుల నీరు గ్రుక్కుకొనుచుఁ బల్కుటయు, వాయుసూతి "అమ్మా! ఏల వగచెదవు? అది యెట్టిదో యెవనివలనఁ బ్రాప్తమయ్యెనో యెఱింగి నాకుందెల్పుము. ఆకార్య మెంత దుర్ఘటంబైనను నేను నెఱవేర్చి యీనేల వేలుపునకుఁ జాల ప్రియ మొనఁ గూర్చెదను. సందియము వలదు" అనినంతనే కుంతి చని చింతార్ణవ మగ్నులయి యున్నవారలను జూచి "ఇదేమి! ఏల కడువంతను గుందుచున్నవారలు? ఆర్చెదవా తీర్చెదవా యని యనక యుందులకుఁ గారణ మెఱింగింపుడు" అన నాగృహస్థుఁ డిట్లనియె.

అమ్మా! ఈపట్టణమున కనతిదూరమున యమునా నదీతీరమున బకుండను నొక దానవుండు గలఁడు. తొలుఁ దొల్తవాఁడీ గ్రామస్థుల నందఱను మ్రింగుచుండ నిందలి విప్రులు వానితో నొకసమయమును గావించిరి. "ఓదానవా!

నీవాకస్మికముగ నూరిపై బడి యిటుల జేయుటచే భీతచిత్తులైమాలాండ్రుఁ, బిల్లవాండ్రు, ముదుసలులు, దిగులుచే మృతిఁ జెందుచున్నారు. నేఁటినుండి యిటులఁ గావింపక యిలు వరుస ననుదినము మే మొక మానిసిని, రెండు దున్నలను బూన్చిన బండినిండ భక్ష్యములతోఁ గూడిన యన్నమును బంపుచుండెదము. ఆమానిసిని నాదున్నలను భక్ష్యాదులనుదిని తృప్తుఁడవుకమ్ము," అనిన నామానిసిదిండి వల్లెయనెను. నాఁటినుండి నేఁటివఱకట్టులే జరుగుచున్నది. పెద్దకాలమున కీవంతు నేఁటికి మాకువచ్చినది. మాపిల్లవాని నెట్లు బంపగలము? అయ్యో! ఈ ముద్దుల పట్టిని విడిచి మే మెట్లు బ్రతుకఁగలము? నేనేపోయి వానికి బలియయ్యెదను" అని దృఢ నిశ్చయుఁడై కన్నీరు మున్నీరుగ నేడ్చుచున్న యా విప్రోత్తమునిఁ గాంచి భోజపుత్త్రి యిట్లు పల్కెను.

"అయ్యా! దీనికింత వగవఁ బనిలేదు. నీకొక్కఁడే పుత్త్రుఁడు. అతఁడును బాలుఁడు. దీని కొక యుపాయము గలదు. నా కేవురుపుత్త్రులు. అందొక్కరుఁడు భీమవిక్రముఁడు. అతఁడు నేఁడు నీ పుత్త్రునకు మాఱుగ నీ బలినిఁ గొని పోయెడిని" అన నా యవనీసురోత్తముఁడు "హరి హరీ! యనుచుఁ జెవులు మూసికొని, "అమ్మా! నీది మాత్రము గర్భవాసము గాదా! మా పిల్లవాఁడు మాకెటులనో నీ కొమరుఁడు నీకట్లు కాదా? అదియునుం గాక మీరు మా

కతిథులు. అతిథినిఁజంపుటకు నొప్పుకొనవచ్చునా! వినలేదే? అతిథిని, నభ్యాగతుని, వెఱచినవానిని, శరణుజొచ్చిన వానిని జంప నొప్పుకొను పాపాత్మునకిహపరములు లే'' వని యను నంతనె కుంతి "భూసురోత్తమా! నా సూనుఁడు మహా బలవంతుడు. ఓడకుము. ఇతఁడు పుట్టిన పదియవనాఁడు నా యొడినుండిజాఱి యొకభూధరముపైఁ బడియె. ఇతనియొడలు తగిలినమాత్రమున కొండెల్ల నుగ్గయ్యెను. కాన నీతఁడు వజ్ర కాయుఁడు. రణంబున వజ్రినైనఁ దాకనోపును. నీబకాసురుఁ డెంత? ఈతఁడు మున్ను పలువురు రక్కసులను రూపు మాపెను. అది కారణముగ నాతని బకాసురునిపైఁ బంప నెంచితినిగాని వేయి పుత్రులున్నను నందుఁ దల్లిదండ్రుల కయిష్టుఁడుండునా?" అని భీమసేనుఁ బిలిచి 'కుమారా! ఆ బకుని జంపి యీభూసురుని విపత్తును దొలఁగించి నాకుఁ బ్రియం బొనగూర్పుము' అనినంతనే భీముఁడు ప్రముది తాత్ముండై 'వల్లె' యని యా రక్కసుని నుక్కడగింప నెంచెను. ఆ బ్రాహ్మణదంపతు లందులకు సంతసిల్లిరి.

పిమ్మట భీముఁడు భక్ష్యాన్నపూర్ణమగు శకటంబెక్కి దక్షిణాభిముఖుఁడై బకుఁడున్న యెడకుం బోయి యమునా నదియొద్దన శకటంబునిల్పి వాఁడువచ్చువఱకూరకుండనేల యని కాలుసేతులు గడిగికొని శుచియై ఆఁకలిపెల్లున నా బండిలోనుండిన యన్నంబును గుడువ నారంభించెను.

అంత బకుండదికాంచి "ఓరీ తులువ! నేడింత ప్రొద్దుపోయి
బలిని దెచ్చితివేల? అదియట్లుండ నాకిడక నీవే కుడుచు
చుంటివే! ఆ యేకచక్ర పురవాసులు నన్నింత చులకన
యొనర్తురే! ఇదె చచ్చెదవు. చూడు నా ప్రతాపము!"
అనుచు మిన్నుదాఁకఁ బెఱిఁగి భీకరాకారముఁ దాల్చి
భీముఁడున్న యెడకుఁబోయి వానివీఁపును బిడికిటంబొడిచెను.
వాయుసూతి యాపోటును లెక్కఁ గొనక యొక్కమ్మడి
యా భక్ష్యాదుల నెల్లను గడుపార భుజించి, యనంతబల
సమేతుఁడై మల్లజఱచి "ఓరీ! దుష్టాత్మా! పాపముని



యెన్నక యీపురవాసుల నందఱఁజంపి వారినాఁజుడు మెక్కి
మిక్కిలి పొగరెక్కి యున్నాఁడవు. దాని నెల్ల నిప్పుడు

శిక్షించెదఁ జూడుము ! నీ మద మడంచి యముని సదనమున కనిచెదను. నాయెదుటఁ జక్కగ నిలువుము. అనుచు నాగాలిపట్టి చలపట్టి, తన చెంతనున్న సాలమును బెఱికి రక్కసునిపై వైచిన వాఁడును నొక్క తాలవృక్షంబును చేదాల్చి దానిని భగ్నముఁ గావించెను. అంత నిరువురు, మల్లయుద్ధ సన్నద్ధులై యొకరి నొకరుపట్టుచుఁ ద్రోచికొనుచు నొండొరులు జయకాంక్షులై పెద్దయుం బ్రొద్దుపోరిరి. అంత భీముఁడొక కరంబునఁ గంఠమును వేఱొక దానిచేఁ గటి ప్రదేశమును గ్రహించి తన మోకాలు నానించి వాని వీఁపు విఱుగం బొడిచెను. ఆ పోటువడి యా దానవుఁడు నవద్వారములనుండి నెత్తురు కాల్వలై పాఱవఁ విగతజీవుఁ డయ్యెను.

భీముఁడు బకాసురునిఁ జంపి వాని కళేబరము నీడ్చు కొనిపోయి పురద్వారమునవైచి యచ్చటి విప్రబృందముల కమందానందం బొనగూర్చి నిజనివాసంబునకుఁ జనియెను. అంతట దల్లియు సోదరులు ననల్పసంతోష భరితులై భీముని పరాక్రమమును, పరోపకారమును మిగులశ్లాఘించిరి.

అర్థములు:—లాక్షాగృహదహనము = లక్కయిల్లు గాల్చుట, ఆర్తధ్వని = ఏడుపురొద, దుస్తరము = దాటరానిది, దుర్ఘటము = సమకూరనిది, నేలవేలుపులు = బ్రాహ్మణులు, సమయము = కట్టుబాటు, మానిసి తిండి = రాక్షసుఁడు, భోజపుత్రి = కుంతి, వజ్రి = ఇంద్రుఁడు, తాలవృక్షము = తాటిచెట్టు, విగతజీవుఁడు = మరణించినవాఁడు.

---

# 17. గోపాలకృష్ణ గోఖలె.

గోఖలె మహారాష్ట్ర బ్రాహ్మణుఁడు. ఈయన క్రీ. శ. 1866 వ సంవత్సరమున కొల్లాపురమునఁ బుట్టెను. ఈతఁడు క్రీ. శ. 1884 వ సంవత్సరమున బొంబాయి పట్టణమందలి



ఎలిఫిన్‌స్టన్ కళాశాలలోఁ జదివి పట్టపరీక్ష (బి. ఏ.) యందు కృతార్థుఁ డయ్యెను.

మహారాష్ట్రులానాఁడు తమ యభివృద్ధికై యనేకము
లగు సంఘములను స్థాపించిరి. వానిలో 'డక్కనువిద్యార్థి
సంఘము" ముఖ్యమైనది. ఇరువదియేండ్లు కొద్ది జీతములను
బుచ్చుకొనుచు సంఘమును నిర్వహించు వారు దాని
విషయమై పనిచేయునట్లేర్పాటులు చేయఁబడెను. నియమిత
మగు నీ యిరువది యేండ్లలోను బాలురకు విద్యను
బోధించుటయేగాక దేశాటనముఁజేసి సంఘ రక్షణమునకై
కొంత మూలధనమును గూడ సంపాదింపవలసి యుండెను.
అట్లు ప్రోగుపడిన ద్రవ్యమును భద్రపఱచి యుక్తముగ
వెచ్చఁబెట్టు భారమును వారియందే యుండెను.

గోఖలె యీ సంఘమును వృద్ధిపఱచుటకై చేసినపని
మిగుల నద్భుతమైనది. ఈ సంఘమునం దతఁడు కార్యనిర్వా
హకుఁడుగ నుండి ఫర్గూసన్ కళాశాలలోఁ గొలఁదిపాటి
జీతమునుబుచ్చుకొనుచు నుపాధ్యాయపదవి నొందియుండెను.
ఈయన ఇంగ్లీషు భాషాసాహిత్య గ్రంథములను, గణిత
శాస్త్రమును బోధించుచు, నందిరువదేండ్లుండుటకు మాట
యిచ్చెను. కొంత కాలమైన పిమ్మట నా కళాశాలకుఁ
బ్రధానోద్యోగి యయ్యెను. ఈ పదవియందుండి తాను
శక్తివంచన చేయక పాటుపడి యనేకులగు విద్యార్థులను
బరీక్షలయందు త్తీర్ణులను చేసెను.

ఈయన హిందువులకుఁ గావించిన మహోపకార
ములను బట్టి హిందువు లీతని పేరు నెన్నండును మఱువ

నోపరు. ఈ దేశవాసులలోఁగాని పరదేశ వాసులలోఁగాని యీయనకుఁగల యద్భుతశక్తిని మెచ్చుకొనని వారును, ఈయనయెడల ననురాగము లేనివారును లేరు. ఈయన వేలకొలఁది మిత్రులను సంపాదించెను. ఈయనకు శత్రువులు లేనేలేరు. ఈతఁడు చేయు వాదములను, ఇచ్చు తీర్పుల నామోదింపని వారు పెక్కండ్రు కలరు. కాని యీయన చిఱచిఱలాడక వారితో నెక్కుడు సౌమ్యముగ వాదములను జరుపుచుండెడివాఁడు. అందుచే నెల్లరకును గౌరవపాత్రుఁ డయ్యెను. కొందఱీయనతో నెదురు కక్షవహించి వాదము చేయుట యసామాన్యమగు గౌరవమే యని యెన్నుచుండిరి. ఈతఁడు తన నిర్దుష్టమగు నడతచేతను బుద్ధిబలము. చేతను శత్రువులకును మిత్రులకును గూడ గౌరవపాత్రుఁడయ్యెను.

జన్మభూమియం దీతనికిఁగల యభిమాన మింతింతని చెప్ప శక్యముగాదు. అందుచేఁ దనశక్తిసామర్థ్యము లన్నియు దేశాభివృద్ధికై వినియోగపఱచెను. లోకమందెల్లరు నెక్కుడుగఁ జూచుకొనెడికలిమిగాని యధికారముగాని బిరుదులుగాని యీయన యెన్నడును గోరలేదు. కాఁబట్టి యీయనకుఁ గల స్వార్థత్యాగము మిగులఁ బ్రశంసనీయము. సత్పురుషుఁడు గాన నీమహనీయుఁ డేపనినైనఁ ద్రికరణశుద్ధిగఁ జేయుచుండెడి వాఁడు. కడు వినయసంపదఁ గలవాఁడు. తానెప్పుడైనఁ దప్పుత్రోవను బడిపోవుచున్నట్లు తెలిసికొనిన యెడల

వెంటనే దానిని సవరణచేసికొన యత్నించువాఁడు. హేతువాదమునకుఁ గట్టుబడువాఁడు. ఇతఁ డితరులకు హితవును బోధించుటకు సమర్థుఁడు. ఇతరులు చేయు హితబోధను గ్రహించుటకును సంసిద్ధుఁడై యుండువాఁడు. తాను నిజముగ గొప్పవాఁడైనను "నేను గొప్పవాఁడను" అను గర్వము లేనివాఁడు. అతి ధైర్యశాలి. దయ, గౌరవము, నమ్రత మొదలగు నుత్తమగుణముల కాటపట్టు.

ఈతఁడు పరుల కుపదేశించు నంశము లన్నింటిని దానాచరించు దృఢశీలముఁ గలవాఁడు. మనపూర్వపు మహామునులవలెనే యీతని నడవడు లన్నియుఁ బహిరాటోపములు లేనివి. యీతని కాచరణయే ప్రధానముగాని మాటలతో నిమిత్తములేదు. తనకుఁగల బుద్ధిబలము నాచరణ యందే వినియోగించు వాఁడు. క్రియలేక యెల్లప్పుడు మాటలు చెప్పువారియెడ నిరాదరణమును, నెల్లప్పుడు క్రియనొనర్చు వారియెడ నాదరణమును గలవాఁడు.

ఈతఁడు బహు గ్రంథద్రష్ట. పెక్కులగు నంశములను బరిశీలన బుద్ధితో గ్రహించిన వాఁడు. హిందూ దేశముతో సంబంధించిన సమస్య లన్నిటితోడను గాఢపరిచయము గలవాఁడు. తాను చేపట్టిన యంశమును గూలంకషముగ నెఱిఁగి యుండువాఁడు. మంచివక్త. ఉపన్యాసకర్త. ఈతని మాటల పొందిక మిగుల సొంపైనది. గొప్ప శిక్షకుఁడని విశేషముగు

ఖ్యాతి వహించెను. తన జన్మస్థానమగు మహారాష్ట్ర దేశమని నను, దాని పూర్వచరిత్ర యనినను సీయనకుఁ గల యభిమాన మింతింతని నుడువరానిది.

గోఖలె దేశాభివృద్ధిఁ గావింప దగిన శక్తిఁ గలవాఁడని రెనడె గారెంతయో విశ్వాస ముంచిరి. గోఖలె రెనడెగారి ప్రియశిష్యుఁడు. ఈతని జీవితము వలన మనము నేర్చుకొనఁ దగిన యంశములు పెక్కుగలవు. ఈతఁడు జీవించినది కొద్దికాలమేయైనను గావించిన కార్యములు పెక్కులు గలవు.

ఈయనకు సి. ఐ. ఇ. (ఇండియారాష్ట్ర మిత్రుఁడు) మొదలగు బిరుదు లనేకములు ప్రభుత్వము వారీయ నమకట్టిరి. కాని యీయన పుచ్చుకొన నంగీకరింపలేదు. గోఖలె ప్రభుత్వమువారియెడ నెక్కువ భక్తి తాత్పర్యములు గలవాఁడు. ప్రభుత్వమువారు మన దేశమును జక్కఁగాఁ బరిపాలన చేయుటయే కాక క్రమ క్రమముగా మన దేశము వారినిఁగూడ రాజ్యపరిపాలనా కార్యములను నిర్వహించుటకై నియమింతు రనియు గోఖలెగారు తమ యనుభవము మీఁదఁ గనిపెట్టినట్లు చెప్పుచుండువారు.

నిమ్నజాతి వారిని జదివించుటయే యీతఁడు తన ముఖ్యపుఁ బనిగా నెన్నుకొను చుండువాఁడు. విద్య బాగుగా వృద్ధియైనగాని మనదేశపు వారికిఁ బెక్కులాభములు చేకూరవని యీయన యభిప్రాయము.

1905 వ సంవత్సరమున బొంబాయివాస్తవ్యులుగోఖలె గారిని హిందూదేశ రాజ్యాంగ దుస్థితినిం గూర్చి తెల్పుటకై యింగ్లాండు పంపిరి. వీ రేబది దినములలో నలువదియై దుపన్యాసముల నిచ్చి చాల విజయము నొందిరి. ఇంగ్లండు నందుండగనే వీరి యారోగ్యము కొంతవఱకుం జెడిపోయెను. అయినను వారు దానిని లెక్కసేయక కాశీపట్టణమున నాయేట జరిగిన మహాజనసభ కధ్యక్షతను వహించెను.

వీరు 1915 వ సంవత్సరమున కీర్తిశేషులైరి. వీరి మరణవార్త విని మిత్రులు, శత్రులు, దేశీయులు, విదేశీయులు నెల్లరుం గడు దుఃఖించిరి.

అర్థములు:—ఉత్తీర్ణులు = గెలుపొందిన వారు, సౌమ్యము = శాంతము, నిర్దుష్టము = తప్పులేనిది, స్వార్థత్యాగము = తన లాభము వదలుకొనుట, త్రికరణములు=మనస్సు, మాట, పని, నమ్రత = అడకువ, బహుగ్రంథద్రష్ట = పెక్కుపుస్తకములం జూచినవాఁడు, కూలంకషము = పూర్ణము, విదేశీయులు = పరదేశస్థులు.

---

# 18. తెనాలి రామకృష్ణకవి.

తెనాలి రామకృష్ణుఁడు బ్రాహ్మణ కుటుంబమున జన్మించెను. అతని పిన్నతనముననె తండ్రి గతించెను. అనంతరమతఁడు తన మేనమామయింటం బెరుగుచుండెను. ఇతనికి బాల్యమున విద్యయం దభిలాష లేకుండెను. బడి

కరుగక యెల్లపుడునుఁ దోడిబాలురతోడ నాడుచుండెను. అట్టి సమయమున నొకనాఁడు సిద్ధుఁడొకఁడు రామకృష్ణుని యొద్దకువచ్చెను. అతఁడు రామకృష్ణునిఁ బిలిచి యొకమంత్ర ముపదేశించెను. ఆ మంత్రమును జపించినచో కాళి సాక్షాత్కరించి యతని కోర్కెలఁ దీర్చునని చెప్పివెడలెను.

నాఁటిరాత్రి రామకృష్ణుఁడు కాళీ దేవాలయంబు లోనికిఁజని భక్తితో మంత్రమును జపింప నామె ప్రత్యక్ష మాయెను. ఆమె రెండు పాత్రలను జూపి, "బాలకా! ఇందొకదానిలోఁ బెరుఁగు నింకొకదానిలోఁ బాలునుఁగలవు. పెరుగుఁ ద్రాగిన విద్యయుఁ బాలుఁ ద్రావిన నైశ్వర్యమును గలుగును. ఇందు నీకేది కావలయునో వేఁడుము" అని యడిగెను.

అంత రామకృష్ణుఁడు "అమ్మా! ఆపాత్రలు నాచేతి కిచ్చెదవేని వానిం జూచి నాయిచ్చ వచ్చిన దాని నెన్ను కొందును" అని వినయముగఁ బలికెను. అందులకా దేవి సమ్మతింప నతఁడా రెండు పాత్రలనుఁ గైకొని యొక్కపరి వానిలోని పెరుఁగును, పాలునుగొంతులోఁబోసికొని మ్రింగెను. కాళి యాతనిపైఁ గోపించి, నీవు పండితుఁడ వయ్యును వికటకవి వగుదువు" అని శపించెను.

తెనాలిరామకృష్ణుఁడు హాస్య ప్రవర్తనమునకుఁ జాల ప్రసిద్ధుఁడు. వీనినిఁ గూర్చిన కథలు పెక్కులు మనదేశమున వాడుకలో నున్నవి.

శ్రీకృష్ణదేవరాయల యాస్థానమునఁ గవు లనేకు లుండిరి. అందు రామకృష్ణుఁడు తక్కిన కవులను బరిహాసము సేయుచుండెను. ఒక దినమున సభలోఁ బెద్దన కవి యీ పద్యమును జెప్పెను.

క. కలనాఁటి ధనము లక్కఱ
కలనాఁటికి దాఁచఁ గమల గర్భుని వశమా
నెలనడిమి నాఁటి వెన్నెల
యలవడునే గాదె బోయ యమవస నిసికిన్.

ఇందలి 'యమవసనిసి' యను పదము మిగుల జులకనగ నుండుటచే రామకృష్ణుఁ డిట్లధిక్షేపించెను.

క. ఉమెతక్కయ దిని సెపితొ
కమ మెఱుగక వెఱ్ఱిఁబుచ్చకయ దినిసెపితొ
ఎమిదిని సెపితివి కపితము
అమవసనిసి యన్నమాట అలసని పెదనా.

ఈ పద్యమును విని సభ్యులందఱును నవ్విరి.

ఒకనాఁడు రాయలు తన వాకిలి కావలిగా నున్న తిమ్మనయను వానికొక విలువగల పచ్చడమును బహుమాన మిచ్చెను. మఱునాఁడా పచ్చడమును గప్పుకొని యతఁడు రాయల ద్వారముకడ నిలువఁబడి యుండెను. అంతట రాజసభకుఁ బోవ నచ్చుటకిఁ బెద్దన్న, ముక్కుతిమ్మన్న, భట్టుమూర్తి, రామకృష్ణుఁడును వచ్చిరి. వాకిలి కావలి

తిమ్మనను జూచి వారు సంతసించిరి. వారిలోఁ బెద్దన యొక పద్యమును జెప్పఁదలఁచి,

క. వాకిలి కావలి తిమ్మా

యనఁగా ముక్కుతిమ్మన

ప్రాకటముగ సుకవివరుల పాలిటిసామ్మా

యనెను. పిమ్మట భట్టుమూర్తి

నీకిదె పద్దెము గొమ్మా

యనఁగా రామకృష్ణుఁడు

నాకీ పచ్చడమె చాలు నయముగ నిమ్మా.

యని పద్యమును బూర్తిచేసెను. వెంటనే కావలి తిమ్మన తనపైనున్న పచ్చడమును దీసి రామకృష్ణునిపైఁ గప్పెను.

రాయలు సభలోనికి రామకృష్ణుఁడా పచ్చడముతో వెళ్ళగా నాపచ్చడ మెట్లు లభించెనని రాయలాతనిఁ బ్రశ్నించెను. జరిగిన వృత్తాంతమును రామకృష్ణుఁడు చెప్పఁగా విని కావలి తిమ్మనయొక్క యౌదార్యమును మెచ్చుకొని రాయలు గొప్ప బహుమాన మిచ్చెను.

అర్థములు:—సాక్షాత్కరించి = ప్రత్యక్షమై, పరిహాసము = నవ్వులాట, కమలగర్భుఁడు = బ్రహ్మ, అమవసనిసి = అమావాస్యనాఁటిరాత్రి, ఔదార్యము = త్యాగము.

# 19. నీతిపద్యావళి.

క. వెలయంగ నశ్వమేధం
బులు వేయును నొక్క సత్య ♦ మును నిరుగడలం
దుల నిడి తూపఁగ సత్యము
వలనన ములుసూపు గౌర ♦ వంబునఁ బేర్మిన్. 1

టీ. ఇరుగడలు = రెండువైపులు, వలనన = దిక్కునసే, పేర్మి = గొప్పతనము.

క. సర్వతీర్థాభిగమనంబు సర్వవేద
సమధిగమము సత్యంబుతో ♦ సరియుగావు;
ఎఱుఁగు మెల్లధర్మంబుల ♦ కెందుఁబెద్ద
యండ్రు సత్యంబు ధర్మజ్ఞు ♦ లైన మునులు. 2

టీ. సర్వతీర్థాభిగమనము — సమస్తమైన పుణ్యతీర్థముల కేగుట, సమధిగమము = చదువుట.

క. ధనమును విద్యయు వంశం
బును దుర్మతులకు మదంబు ♦ బొనరించును స
జ్జనులైనవారి కడఁకువ
యును వినయము నివియతెచ్చు ♦ నుర్వీనాథా. 3

టీ. అడకువ = విధేయత, పొనరించును = కలుగఁజేయును.

తే. గీ. ఆర్తురే బాంధవులు లోక ♦ మందునాకు
సత్యమే తల్లి, జ్ఞానమే ♦ జన్మదాత

ధర్మమే తోడఁ బుట్టువు దయయె హితుఁడు
శాంతియే ధర్మచారిణి ♦ క్షమయె కొడుకు. 4

టీ. జన్మదాత = తండ్రి, ధర్మచారిణి = భార్య, క్షమ = ఓర్పు.

ఆ. వె. నీతిలేనివాని నిందింత్రు లోకులు
లేదు సేగి లాఁతి ♦ లేకయున్నఁ
గాన మానవుఁడు ♦ పూనిక నయవిద్య
గడనసేయ మొదలఁ ♦ గడఁగవలయు 5

టీ. సేగి=కీడు, లాఁతి=వేఱొకటి, నయవిద్య = నీతిచదువు, గడన సేయఁగ = సంపాదించుటకు.

క. తనువున విఱిఁగిన యలుఁగుల
ననువునఁ బుచ్చంగవచ్చు ♦ నతి నిష్ఠురతన్
మనమున నాటిన మాటలు
వినుమెన్నియుపాయములను ♦ వెడలునె యధిపా! 6

టీ. అలుఁగులు = బాణములు, అనువు = ఉపాయము, నిష్ఠురత = కఠిన స్వభావము.

క. మనమునకుఁ బ్రియంబును హిత
మును బథ్యము దథ్యమును న ♦ మోఘము మధురం
బును బరిమితమును నగు పలు
కొనరఁగఁ బలుకునది ధర్మ ♦ యుతముగ సభలన్. 7

టీ. పథ్యము = అభిరుచియైనది, తథ్యము=సత్యము, అమోఘము = వ్యర్థము గానిది.

క. చెలిమియుఁ బగయును దెలివియుఁ
గలకయు, ధర్మంబు బాప ♦ గతియును, బెంపుం
దులువతనంబును వచ్చును
బలుకుఁబడిన కాన బొసఁగఁ ♦ బలుకఁగవలయున్. 8

టీ. పెంపు=గొప్పతనము, తులువతనము = దుష్టతనము, పొసగన్= పరిపడునట్లు.

తే. గీ. పలికెద శతాధికగ్రంథ ♦ భావమెల్ల
దేట తెల్లంబుగా నొక్క ♦ మాటలోనఁ
బుడమిని బరోపకృతి సేఁత ♦ పుణ్యమునకె
పరుల కపకృతి సేఁత పా ♦ పంబు కొఱకె. 9

టీ. శతాధిక గ్రంథభావము = నూఱుకంటె నెక్కువ పుస్తకముల యభిప్రాయము, తెల్లము = స్పష్టము.

ఆ. వె. కీర్తిలేని వాని ♦ కిని జీవనంబు ని
రర్థకంబు సూవె ♦ యవనిమీఁద
నిత్యమయిన ధనము ♦ నిర్మల కీర్తియ;
యట్టి కీర్తివడయు ♦ టశ్రమంబె. 10

టీ. నిరర్థకము = పనికిమాలినది, అశ్రమము = కష్టము లేనిది.

క. కందుకము వోలె సుజనుఁడు
గ్రిందంబడి మగుడ మీఁది ♦ కిన్నెగయుసుమీ
మందుఁడు మృత్పిండమువలెఁ
గ్రిందం బడి యడఁగియుండు ♦ గృపణత్వమునన్. 11

టీ. కందుకము=బంతి, మృత్పిండము = మట్టిముద్ద, కృపణత్వము= దీనత్వము.

క. ఏనరునకు విత్తముగల
దా నరుఁడు కులీనుఁ డధికుఁ ♦ డార్యు డతండే
ధీనిధి ధన్యుఁడు నేర్పరి
నానాగుణగణము కాంచ ♦ నంబున నిలుచున్. 12

టీ. కులీనుఁడు = ఉత్తమకులుఁడు, ధీనిధి = గొప్ప బుద్ధిశాలి, కాంచనము = బంగారము.

క. జనకుఁడు, దపమును ధర్మం
బును విద్యయుఁ బరమదైవ ♦ మును గావున నా
తనికిఁ బ్రియంబగు పని సే
సిన దేవతలెల్ల బ్రీతిఁ ♦ జెందుటఁ గల్గున్. 13

టీ. పరమదైవము = గొప్ప దేవుఁడు.

తే. గీ. సత్యసూక్తి ఘటించు ధీ ♦ జడిమ మాన్చు
గౌరవ మొసంగు జనులకుఁ ♦ గలుష మడఁచు
కీర్తిఁ బ్రకటించుఁ జిత్త ♦ విస్ఫూర్తిఁ జేయు
సాధుసంగంబు సకలార్థ ♦ సాధనంబు. 14

టీ. ధీజడిమ = బుద్ధిమాంద్యము, కలుషము = పాపము, సాధుసంగము = ఉత్తములతో స్నేహము.

క. మిత్రద్రోహి కృతఘ్నుఁడు
ధాత్రీసురహంత హేమ ♦ తస్కరుఁడు సురా
పాత్రీభూతుఁడు నిందా
పాత్రులు వీరెల్ల నరక ♦ భవనావాసుల్. 15

టీ. కృతఘ్నుఁడు = చేసిన మేలు మఱచువాఁడు, ధాత్రీసురహంత కుఁడు = బ్రాహ్మణులఁ జంపినవాఁడు, హేమతస్కరుఁడు = బంగారము కొంగిలించినవాఁడు.

క. విను, పూర్వకర్మ ఫలములు
తనకు వశముగాక పొందుఁ ♦ దఱితో వానిం
కనుగొన నేరక మూఢుఁడు
తనకాపద యైనచోట ♦ దైవము దూఱున్. 16

టీ. తఱి = సమయము, దూఱున్ = నిందసేయును.

తే. గీ. చుట్టములలోన నొప్పమి ♦ పుట్టునప్పు
డడ్డుపడి వారితోడఁ బో ♦ రాడియైన
బూని యుడుపంగఁ జొరకున్న వానిఁ గ్రూర
కర్ముఁడని చెప్పుదురు కర్మ ♦ కాండవిదులు. 17

టీ. ఒప్పమి = విరోధము, క్రూరకర్ముఁడు = దుష్టుఁడు.

క. కృత మెఱుఁగుట పుణ్యము స
న్మతి దానికి సమము సేఁత ♦ మధ్యము, తత్త
త్కృతమున కగ్గలముగ స
త్కృతిసేయుట యుత్తమంబు ♦ కృతబుద్ధులకున్. 18

టీ. కృతము = చేసినది, అగ్గలము = విస్తారము.

క. తనకుల ధర్మము విడువక
మనుట పరమధర్మ మండ్రు ♦ మాన్యులు చిత్తం
బునఁ గృపగలుగుట ముఖ్యపుఁ
బని సైరణపలయు నఖిల ♦ భావములందున్. 19

టీ. మాన్యులు = పూజ్యులు, సైరణ = ఓర్పు.

గీ. పాపముల కెల్ల నెక్కుడు ♦ పాతకములు
సువ్వె క్రోధ లోభంబులు ♦ సువ్రతాత్మ !
వాని రెంటి జయించిన ♦ వాఁడుగాని
యెందుఁ బరమధార్మికుఁడని ♦ యెన్నఁబడఁడు. 20

టీ. క్రోధము = కోపస్వభావము, లోభము = పరద్రవ్యాశ.

క. క్రమమున శిష్టాచార
క్రమమెఱిగియు ధర్మమునకు ♦ గడువాటంబై
విమలంబగుఁ జిత్తము స
త్యమును నహింసయును దనకుఁ ♦ దానలవరచున్.

టీ. వాటము = అనుకూలము.

ఆ. వె. విను మహింస ధర్మ ♦ వితతి కెల్లను మేటి
యదియు సత్యయుక్త ♦ మైన వెలయు
ననఘ శిష్టచరిత ♦ లందు సత్యము కడు
నధికమనిరి శ్రుతుల ♦ నరసి బుధులు. 22

టీ. శిష్టచరితలు = ఉత్తమమగు నడవడులు, శ్రుతులనరసి = వేదము లను విచారించి, బుధులు = పండితులు.

క. గుణులం జేరిన పురుషుఁడు
గుణి యగు నవగుణులఁ గూడిఁ ♦ గుణహీనుఁడగున్
బ్రణుతికి నెక్కిన నదులు ల
వణజలధిం గూడి చెడిన ♦ వడువున నొందున్. 23

టీ. అవగుణులు = చెడుగుణముగలవారు, ప్రణుతి = పొగడిక, లవణజలధి = ఉప్పునీటి సముద్రము, వడువు = రీతి.

తే. గీ. పౌరుషజ్ఞానకీర్తుల ♦ బరఁగనేని
వాని సంపద యొకపూఁట ♦ యైనఁజాలు
నుదరపోషణ మాత్రమై ♦ యుర్విమీఁదఁ
గాకి చిరకాలమున్న నే ♦ కార్యమగును ? 24

టీ. ఉదరపోషణము = పొట్టబోసికొనుట.

ఆ. వె. బుద్ధిమంతుఁడైన ♦ పురుషుండుఁ దనశత్రు
హితుఁడటంచుఁ జేర ♦ నిచ్చిచెడును
దప్తజలముచేతఁ ♦ దడిసిన యగ్నిదా
హీనమగుచు శమిత ♦ మైనకరణి. 25

టీ. తప్తజలము = కాచిననీరు, శమితము=తగ్గిపోయినది.

## 20. పొడుపుఁబద్యములు.

సీ. నారీలలామ నీపేరేమి చెప్పుమన్నఁ
దమిమీఁఱ నెడమ నేత్రమును జూపె
మత్తేభయాన నీమగని పేరేమన్న
దనచేతి జీర్ణ వస్త్రంబుఁజూపె
వెలఁది నీకేమైన బిడ్డలా చెప్పుమన్నఁ
గర మొప్ప మింటి చుక్కలను జూపె
కుటిల కుంతలనీదు కులము నామఁగొల్లన్నఁ
బంజరమ్మునను న్న పక్షిఁజూపె

గీ. ప్రభువు మీ కెవ్వరన్న గోపకునిఁజూపె
ధవుని వ్యాపారమేమన్న దండమిడియె
చతురమతులార యాప్రౌఢ జాణతనముఁ
దెలిసికొనరయ్య బుద్ధి కౌశలము మెఱయ.

(ఉ. ఇది కుచేలుని భార్యయగు వామాక్షివాక్యము (1) వామాక్షి, (2) కుచేలుఁడు, (3) ఇరువదియేడుమంది, (4) విప్రకులము, (5) కృష్ణుఁడు, (6) తపస్సుచేయుట.)

సీ. మనుజుని యాకార మహిమకు మొదలేది?
నగవైరి వైరికి నగరమేది?
రాముండు కాచిన రాక్షసపక్షేది?
సిరికన్ను లార్జించు చెలువమేది?
పంచబాణునివింటఁ బరగిన రుచియేది?
గిరిజాపతి భుజించు గిన్నెయేది?
చెలఁగి నయనరక్ష చేసెడి విధమేది?
నరుల మానముగాచు తరువదేది?

గీ. అన్నిటికిఁ జూడ రెండేసి యక్షరములు
ఆకు లుడుపంగఁ దుదలెల్ల నాదులగును
జెప్పనాతఁడు భావజ్ఞ శేఖరుండు
చెప్పలేకున్న నగుదు నే చిన్నినగవు.

(ఉ. తల, లంక, కాకా, కాంతి, తీపు, పుఱ్ఱె, ఱెప్ప, ప్రత్తి.)

సీ. రాముఁడెవ్వానితో రావణు మర్దించె?
పరవాసు దేవుని పట్నమేది?

రాజమన్నారుచే రంజిల్లు శరమేది?
వెలయు గానుకపంట విత్తదేది?
అలరంభ కొప్పులో నలరు పూదండేది?
సభవారి నవ్వించు జాణుడెవండు?
సీతపెండ్లికి నోలి చేసిన విల్లేది?
శ్రీకృష్ణుం డేయింటం జెలగుచుండు?

గీ. అన్నిటికి జూడ నైదేసి యక్షరములు
ఈవలావల జూచిన నేకవిధము,
చెప్పునాతండు భావజ్ఞ శేఖరుండు
చెప్ప లేకున్న నగుదునే చిన్నినగవు.

(ఉ. తోఁకమూఁకతో, రంగనగరం, ఒకోలకోల, జంబీరబీజం, మందారదామం, వికటకవి, పంచాస్యచాపం, నందసదనం.)

---

# 21. ప్రార్థన పద్యములు.

క. నీపాద కమల సేవయు
నీపాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపార భూతదయయును
దాపస మందార నాకు దయ సేయంగదే. 1

టీ. పాదార్చకులు = పాద సేవకులు, నెయ్యము = స్నేహము, మందార = కల్పవృక్షము వంటివాండా.

క. జో జో కమల దళేక్షణ
జో జో మృగరాజమధ్య జో జో కృష్ణా
జో జో పల్లవ కరపద
జో జో పూర్ణేందు వదన జోజో యనుచున్. 2

టీ. మృగరాజమధ్య=సింహము నడుమువంటి నడుము గలవాఁడా ! పల్లవకరపద=చిగురువంటి చేతులు, కాళ్ళు గలవాఁడా !

క. నర్తకుని భంగిఁ బెక్కగు
మూర్తులతో నెవ్వఁడాడు మునులు దివిజులుం
గీర్తింప నేర రెవ్వని
నర్తన మొరులెఱుఁగ రట్టివాని నుతింతున్. 3

టీ. నర్తకుఁడు = ఆటలాడువాఁడు, దివిజులు = దేవతలు.

క. అనయమును భువన రక్షణ
మునకై స్వేచ్ఛాను రూపమునఁ బుట్టెడి వి
ష్ణుని భయ విరహితమగు పద
వనజ యుగం బర్థిఁ గొల్తు వారని భక్తిన్. 4

టీ. పదవనజయుగము=పాదపద్మముల జంట, అర్థిన్ = కోరికతో.

చ. తపములు చేసియైన మఱిదానము లెన్నియుఁ జేసియైన నే
జపములు జేసియైన ఫలసంచయ మెవ్వని జేర్పకున్న హే
యపదములై దురంతవిపదంచితరీతిగ నొప్పుచుండు న
య్యపరిమితున్ భజించెద నఘౌఘనివృత్తిదు భద్రకీర్తిమున్ 5

టీ. హేయము=అసహ్యించుకొనదగినది, దురంతము= అంతులేనిది, అఘౌఘము = పాపసమూహము.

# 22. సమస్యలు.

క. అత్తుగ తూరుపు పడమటఁ
జిత్తరువు లిఖించి యలతఁ జెందితి నౌరా
చిత్తరువు వ్రాయ బోవలె
నుత్తరమున భాను బింబ ముదయంబాయెన్. 1

టీ. భానుబింబము = సూర్యమండలము.

క. ఇప్పూర మేలెడు పార్థివుఁ
డిప్పుడు నీతావుకనెడి నిదిగో యార్యా
తెప్పున నంగడి తలుపులు
కప్పుకు సంపంగి నూనె కావలెవిూకే. 2

టీ. పార్థివుఁడు = రాజు, ఆర్యా = అయ్యా.

క. కుప్పల కావలి పోవగఁ
జెప్పాలు కట్టియును బూని శీఘ్రముతోడన్
జప్పుడగుచు వచ్చెడి వెం
కప్పను దగఁ జూచి పాము గడగడ వడకెన్. 3

టీ. కుప్పలకావలి = ధాన్యపుఁ గుప్పలకుఁ గావలి.

క. కందర్ప హారుఁడు నరుఁడును
పందికినై పోరి పోరి పరి పరి గతులన్
క్రిందైన హరుని జూపుట
చందురులో నిట్టి నేల చెంగలి మేసెన్. 4

టీ. కందర్పహరుఁడు = శివుఁడు, ఇఱ్ఱి = మగజింక, చెంగలి=ఒక విధమగు గడ్డి.

క. నల్లని దేవర యగ్రజుఁ
డుల్లము రంజిల్లఁగన్న యువిదకు ధరణీ
వల్లభుఁడగు వసుదేవుని
యల్లుని యిల్లాలు మేనయత్తగు సుమ్మీ. 5

టీ. నల్లనిదేవర యగ్రజుఁడు = కృష్ణుని యన్నయగు బలరాముఁడు.

## 23. ఆటవిడుపు పద్యములు.

ఆ. అక్షరంబు వలయుఁ గుక్షి జీవనులకు
నక్షరంబు జిహ్వ కిక్షురసము
అక్షరంబు తన్ను రక్షించు గావున
నక్షరంబు లోక రక్షితంబు. 1

టీ. అక్షరము = విద్య, ఇక్షురసము = చెఱకు పానకము.

ఆ. ఆఢ్యుఁ డన్న యప్పు డందఱు బూజ్యులె
లెక్కమీఁద సున్న లెక్కినట్లు
అతఁడు పోవు వెనుక నంద ఱపూజ్యులే
లెక్కలేక సున్న లేఁగినట్లు. 2

టీ. ఆఢ్యుఁడు = కలవాఁడు, పూజ్యులు = పూజింపఁ దగినవారు, సున్నవంటివారు = పనికిమాలినవారు.

క. చేతనగువాఁడు కార్యము
కై తగ్గును వంగఁగాక యల్పుండగునా?
యేతము వడిఁ దా వంగును
బాతాళము నీరుఁ దెచ్చి బయలంజల్లున్. 3

టీ. అల్పుడు = నీచుఁడు.

ఉ. స్థానవిశేష మాత్రమున దామరపాకున నీటిబొట్టు! నిన్
బూనిక మౌక్తికంబనుచుఁబోల్చినమాత్రనయింతగర్వమా
మానవతీ శిరోమణుల మాలికలందున గూర్పవత్తువో
కానుకలియ్యవత్తువొవికాసముసెత్తువొ విల్వఁదెత్తువో. 4

టీ. స్థానవిశేషము=ఉన్నతావుయొక్క గొప్పతనము, మౌక్తికము=ముత్యము, మానవతీ శిరోమణి = స్త్రీరత్నము.

క. సామజము చెఱకు మేసిన
దోమలు పదివేలు సేరి త్రోలంగలవా?
గ్రామపతి తగవుఁ దప్పిన
గ్రామములో నున్నవారు కాదనఁగలరా? 5

టీ. సామజము=ఏనుఁగు, గ్రామపతి=రాజు, తగవు=న్యాయము.

క. అసమాన దానవిద్యా
రసికత లేనట్టి నరుని బ్రతు కేటికిసీ
కస వేఱుక తిని బ్రదకదె
పసరము తన కడుపునిండఁ బర్వతకొండా! 6

టీ. అసమానము = సాటిలేనిది, కసవు=గడ్డి, పసరము = పసువు.

క. ఇప్పటి యన్నము కొఱకై
తిప్పలబడి నుందనేల ? దేవుఁడు శిలలోఁ
గప్పకొసంగఁడె ? హారము
కుప్పలుగ మహేంద్రనాథ ! గోకర్ణేశా ! 7

టీ. తిప్పలు = అవస్థలు, హారము = ఆహారము.

ఆ. ఇఱుక రాదు చేత నిసుమంత నిప్పైనఁ
గొఱుకఁబడునె యినుము కొంచమైన
నఱుకరాదు నీళ్ళు నడిమికి రెండుగాఁ
బెఱుక రాదు బావి పెల్లగిలఁగ. 8

ఇఱుక, కొఱుక, నఱుక, పెఱుక, అను మాటలతోఁ బద్యమురచింపు మని సరస్వతి కోరఁగా మరింగంటి సింగరాచార్యులను కవి యీపద్యము రచించెనఁట.

గీ. ఓయి కురురాజ ! నీకొడుకు తగోల
కొండవలె నుండు ఘనమాల ముండఁ దిఁకను
భండనంబున గెలుదు పాండుసుతులు
ఉదరమునఁ బూలదండ లేకొత్తకుండ. 9

గోలకొండ, మాలముండ, పూలకండ, కొత్తకుండ అను వాక్యముల నిమిడ్చి భారతార్థమునఁ జెప్పఁబడిన పద్యము. గోల = నేర్పులేనివాఁడు, ఆలముండదు = ఆలస్యముండదు, లేకొత్తకుండక = చేసల నలిగిపోకుండు పట్లు (అనాయాసముగా).